బుధవారం
24-01-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 212
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

గణతంత్ర మహిళా పటాలానికి కంటి వైద్యురాలు నేతృత్వం

న్యూదిల్లీ: గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో అందరూ మహిళలే ఉన్న పటాలం పాల్గొననుంది. ఇలా అందరూ మహిళలే ఉన్న పటాలం భారత రిపబ్లిక్ డే వేడుకల పరేడ్‌లో పాల్గొనడం చరిత్రలో ఇదే తొలిసారి అని అధికారులు తెలిపారు. ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌కు చెందిన ఈ ఆల్-విమెన్ కాంటింజెంట్‌కు కంటి వైద్యురాలు, పారా ట్రూపర్ అయిన మేజర్ శ్రీష్టి ఖుల్లర్ నేతృత్వం వహించనున్నారు. రిపబ్లిక్ డే వేడుక పరేడ్‌లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ మెడికల్ సర్వీసెస్‌కు చెందిన ఆల్ విమెన్ కాంటింజెంట్‌కు నేతృత్వం వహించే అవకాశం దక్కడంపై మేజర్ శ్రీష్టి ఖుల్లర్ ఆనందం వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి నెలాఖరుకే
ఎన్నికల షెడ్యూల్?

- ఏప్రిల్ 16 హద్దుగా పెట్టుకుని ఏర్పాట్లు చేసుకోవాలని సీఈసీ ఉత్వర్వులు
- ఏపీలో గతంలో వలే తొలిదశలో ఎన్నికలు జరిగే అవకాశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరి నెలాఖరుకే ఎన్నికల షెడ్యూలు విడుదలయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ తేదీగా ఏప్రిల్ 16ను డేట్ ఆఫ్ రిఫరెన్స్‌గా తీసుకోవాలని అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం నోట్ పంపింది. ఇందులో లోక్‌సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు చేస్తున్న కసరత్తులో భాగంగా ఈ తేదీని రిఫరెన్స్‌గా పెట్టుకుని ఏర్పాట్లు చేసుకోవాలని ఈసీ సూచించింది. దీంతో ఇప్పుడు అధికారులు ఏప్రిల్ 16వ తేదీని టార్గెట్‌గా పెట్టుకుని ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు మరింత వేగవంతం చేయనున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర ఎన్నికల సంఘం అధికారుల మార్పులు, ఓటర్ల జాబితా సవరణ, ఇతర అంశాలపై అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించింది. రాజకీయ పార్టీల అభిప్రాయాలను కూడా తెలుసుకుంది. తాజాగా ఓటర్ల తుది జాబితాను కూడా ఎన్నికల సంఘం ప్రకటించింది. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఏపీలో జమిలి ఎన్నికలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉండటంతో ఎన్నికల సంఘం ఏర్పాట్లు వేగవంతం చేసింది. 2019లో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా ఏడు దశల్లో పోలింగ్ నిర్వహించగా, తొలిదశ పోలింగ్ రాష్ట్రాల జాబితాలో ఏపీ ఉంది. ఈసారి కూడా ఏపీకి తొలి విడతలోనే పోలింగ్ జరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘం అంచనా వేస్తోంది. అందుకే ఏప్రిల్ 16వ తేదీని హద్దుగా పెట్టుకుని పని చేయాలని అధికారులకు ఉత్తర్వులు జారీ చేసింది. అందువల్ల ఏప్రిల్‌లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు ఫిబ్రవరి చివరిలో లేదా మార్చి మొదటి వారంలో షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన సర్క్యులర్‌ను కేవలం రిఫరెన్స్‌గా తీసుకుని ఎన్నికల కార్యక్రమాలకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, సర్క్యులర్‌లో ఉన్నట్లుగా ఏప్రిల్ 16 ఎన్నికల తేదీ కాదని అధికారులు చెబుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల సంఘ బృందం పర్యటించిన సందర్భంగా రాజకీయ పార్టీలు ఎన్నికల తేదీపై ఆరా తీసిన నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికల బృందాన్ని అప్రమత్తం చేసేందుకు ఏప్రిల్ 16ను టార్గెట్‌గా నిర్ణయించి సర్క్యులర్ జారీ చేసినట్లు తెలుస్తోంది.

రాజ్యసభ బెర్తులపై
వైసీపీ గురి!

- మూడేళ్లనాటి గంటా రాజీనామా ఆమోదం
- పార్టీ మారినవారికీ నోటీసులు
- మూడు స్థానాల కైవసమే లక్ష్యంగా అడుగులు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రంలో త్వరలో ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాల భర్తీకి ఎన్నికలు జరుగనున్న క్రమంలో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఏప్రిల్ 2వ తేదీ నాటికి ఖాళీ కానున్న మూడు స్థానాలను కైవసం చేసుకోవడమే లక్ష్యంగా ఇప్పటినుంచే పావులు కదుపుతోంది. దీనిలో భాగంగా మూడేళ్ల క్రితం రాజీనామా చేసిన టీడీపీ శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు రాజీనామాను మంగళవారం స్పీకర్ తమ్మినేని సీతారాం అకస్మాత్తుగా ఆమోదించారు. అలాగే ఇటీవల పార్టీని వీడిన వైసీపీ శాసనసభ్యులకు కూడా శాసనమండలి కార్యదర్శి నోటీసులు జారీ చేశారు. గతంలో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా వైసీపీ శాసనసభ్యుల మద్దతుతో టీడీపీ అభ్యర్థి పంచుమర్తి అనూరాధ అనూహ్యంగా విజయం సాధించిన విషయం తెలిసిందే. వైసీపీకి చెందిన కొందరు అసంతృప్త ఎమ్మెల్యేలు విప్ ధిక్కరించి మరీ టీడీపీ అభ్యర్థికి ఓటు వేయడంతో అనూరాధ గెలుపొందారు. ఇదే పరిస్థితి మరలా రాజ్యసభ ఎన్నికలకు తలెత్తే అవకాశం ఉందని వైసీపీ అధిష్ఠానం భావిస్తోంది. వచ్చే సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని సగం నియోజకవర్గాలకు ఎంపిక కార్యక్రమం పూర్తయింది. అయితే అభ్యర్థుల మార్పులు, చేర్పులు పెద్దఎత్తున చోటు చేసుకుంటున్నాయి. రెండు సార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచిన వారికి

- మిగతా 2 లో

రాజీనామా కలకలం

- వైసీపీకి ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు గుడ్‌బై
- గుంటూరు ప్రతిపాదనకు తిరస్కరణ
- నరసరావుపేట బరిలో బీసీ అభ్యర్థి?
- ఇప్పటికే మచిలీపట్నం, కర్నూలు ఎంపీలు దూరం
- క్యాంపు కార్యాలయానికి నేతల క్యూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అభ్యర్థుల జాబితాపై కసరత్తు జరుగుతున్న వేళ...టికెట్ లభించదని భావించిన వైసీపీ నేతలు రాజీనామా బాటపడుతున్నారు. ఇప్పటికే ఇద్దరు ఎంపీలు బాలశౌరి, సంజీవ్‌కుమార్ రాజీనామా చేయగా తాజాగా నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తన ఎంపీ పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. ఈ రాజీనామాలు వైసీపీలో కలవరం పుట్టిస్తున్నాయి. వైసీపీ పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌చార్జిల మార్పులు చేర్పుల్లో భాగంగా నరసరావుపేట ఎంపీ టికెట్‌పై కొంతకాలంగా అనిశ్చితి నెలకొంది. నరసరావుపేట నుంచి బీసీ అభ్యర్థిని బరిలో దించాలని వైసీపీ అధిష్ఠానం నిర్ణయించింది. లావు శ్రీకృష్ణదేవరాయలును గుంటూరు లోక్‌సభకు వెళ్లాలని సూచించింది. అందుకు శ్రీకృష్ణదేవరాయాలు నిరాకరించారు. నరసరావుపేట నుంచి అయితే పోటీ చేస్తానని ఆయన అధిష్ఠానానికి తెగేసి చెప్పారు. కృష్ణదేవరాయలుకు మద్దతుగా కొంతమంది ఎమ్మెల్యేలు వైసీపీ అధినేత జగన్‌కు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. మళ్లీ నరసరావుపేట ఎంపీ సీటు శ్రీకృష్ణదేవరాయలుకే ఇవ్వాలని కోరారు. దీంతో ఈ సీటుపై నిర్ణయాన్ని జగన్ పక్కనపెట్టారు. అధిష్ఠానం తుది నిర్ణయం తీసుకోకముందే ఎంపీ పదవికి, పార్టీకి శ్రీకృష్ణదేవరాయలు రాజీనామా చేసి... వైసీపీకి షాక్ ఇచ్చారు. నరసరావుపేట సీటు బీసీలకు కేటాయించాలని జగన్ నిర్ణయించుకోవడంతో టీడీపీ నేతలతో శ్రీకృష్ణదేవరాయాలు సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలు నరసరావుపేట నియోజకవర్గంలో పెద్దఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. వివాదరహితుడిగా గుర్తింపు పొందారు. పార్టీ శ్రేణులతో సఖ్యత పెంచుకున్నారు. ఇప్పటికే వైసీపీ మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్ పార్టీకి రాజీనామా చేశారు. ఇప్పటివరకు ముగ్గురు ఎంపీలు వైసీపీని వీడారు. ఇదేబాటలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాస్‌రెడ్డి ఉండే అవకాశం కనిపిస్తోంది. బాలశౌరికి టికెట్టు ఇవ్వడానికి అధిష్ఠానం నిరాకరించింది. మచిలీపట్నం పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలతో విభేదాలు ఉండటం ఆయనకు ప్రతికూలంగా మారింది. దాంతోపాటు సర్వేలోనూ ఆయనకు విజయావకాశాలు లేవని వైసీపీ గుర్తించింది. నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు గెలిచిన కొంతకాలం నుంచే వైసీపీకి రెబల్ అభ్యర్థిగా ఉన్నారు. వరుసగా వైసీపీకి రాజీనామాలు కొనసాగడంతో, ఆ పార్టీ నేతల్లో ఆందోళన నెలకొంది. అటు టికెట్లు దక్కని ఎంపీలతోపాటు ఎమ్మెల్యేలు సైతం ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇది రాబోయే ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపుతుందని వైసీపీ శ్రేణులో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఐదో జాబితాపై కసరత్తు

మరోవైపు, ఐదో జాబితా కసరత్తుతో మళ్లీ తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వైసీపీ ఎమ్మెల్యేలు మంగళవారం క్యూ కట్టారు. రెండు, మూడు

- మిగతా 2 లో

హార్సిలీ హిల్స్ భూముల గోల్‌మాల్

- హౌస్ బిల్డింగ్ సొసైటీలో భారీ అక్రమాలు
- నిషేధం ఉన్నా రిజిస్ట్రేషన్ల జోరు
- పట్టించుకోని పాలకులు

8లో

అడుగడుగునా ఆటంకాలు

- రాహుల్ యాత్రను అడ్డుకున్న పోలీసులు
- అసోంలో ఉద్రిక్తత
- బజరంగదళ్‌కు లేని ఇబ్బందులు మాతోనే వస్తాయా
- అడ్డంకులతో మా యాత్రకు మంచి ప్రచారం
- అయోధ్య వ్యవహారం రాజకీయ కార్యక్రమం
- రాహుల్‌గాంధీ విమర్శలు
- కేసు నమోదుకు సీఎం హిమంత ఆదేశం

2లో

కర్పూరి ఠాకూర్‌కు
భారత రత్న

- బీహార్ సీఎంగా రెండుసార్లు...
- శతజయంతి సందర్భంగా పురస్కారం

న్యూదిల్లీ: బీహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌కు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డు ప్రకటించింది. 1977-79 మధ్య కాలంలో బీహార్ సీఎంగా పని చేశారు. ఓబీసీ నాయకుడిగా ఆయనకు జన నాయక్ అనే పేరు కూడా ఉండేది. ఆయన శత జయంతి సందర్భంగా కర్పూరి ఠాకూర్‌కు భారత రత్న అవార్డు ప్రకటించారు. సోషలిస్టు పార్టీ, భారతీయ క్రాంతి దళ్ పార్టీల తరపున 1970 డిసెంబరు నుంచి 1971 జూన్ వరకూ బీహార్ సీఎంగా కర్పూరి ఠాకూర్ పని చేశారు. తిరిగి 1977 డిసెంబరు నుంచి 1979 ఏప్రిల్ వరకూ సీఎంగా ఉన్నారు. 1924 జనవరి 24న బీహార్‌లోని సమస్తిపూర్‌లో జన్మించారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పని చేసి జైలు పాలయ్యారు కూడా. 1952లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తేజ్‌పూర్ నియోజక వర్గం నుంచి సోషలిస్టు పార్టీ అభ్యర్థిగా భారీ మెజార్టీతో గెలిచి విధాన సభలో అడుగు పెట్టారు. మద్య నిషేధాన్ని అమలు చేయడంతో పాటు వెనుకబడిన ప్రాంతాల్లో అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యా వికాసానికి కృషిచేశారు. జేపీ ఇచ్చిన పిలుపుతో ఎంతోమంది యువత ఉద్యమంలోకి రాగా.. అలా వచ్చిన లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్, రాం విలాస్ పాశ్వాన్ వంటి నేతలకు ఠాకూర్ రాజకీయ గురువుగా మారారు.

లిఖితపూర్వక హామీతోనే
సమ్మె విరమణ

సహకరించిన వారందరికీ అంగన్‌వాడీ నేతల అభినందనలు

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): వేతనాలపై లిఖితపూర్వక హామీతోనే సమ్మె విరమించామని అంగన్‌వాడీ సంఘాల జేఏసీ మంగళవారం ప్రకటించింది. సుదీర్ఘకాలంగా తాము చేపట్టిన సమ్మెకు అండగా నిలిచిన రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలకు ధన్యవాదాలు తెలిపింది. ప్రత్యేకించి సమ్మె విజయవంతంగా కొనసాగడానికి కారణమైన అంగన్‌వాడీ కార్యకర్తలు, డిమాండ్లు అంగీకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ), ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ), ఏపీ ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) నాయకులు ఎస్.మంజుల, జి.బేబీరాణి, కె.సుబ్బరావమ్మ, వీఆర్ జ్యోతి మంగళవారం విజయవాడ బాలోత్సవ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మంజుల మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వంతో సుదీర్ఘంగా చర్చలు జరిగాయన్నారు. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ఐసీడీఎస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయలక్ష్మి, కమిషనర్ జానకి, ఆర్థికశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రావత్ మూడు యూనియన్ల ప్రతినిధులతో మాట్లాడారని తెలిపారు. యూనియన్లు ప్రతిపాదించిన ఎక్కువ డిమాండ్లను పరిష్కరించడానికి ప్రభుత్వం అంగీకరించిందని, దీంతో పరస్పర అవగాహనతో సమ్మె విరమించినట్లు తెలిపారు.

అంగీకరించిన డిమాండ్లు

అంగన్‌వాడీలకు జులైలో వేతనాలు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. యూనియన్లకు, ప్రభుత్వానికి ఆమోదయోగ్యమైన వేతనం పెంచడానికి రాతపూర్వక హామీ ఇవ్వడానికి అంగీకరించింది. ఉద్యోగ విరమణ సమయంలో వర్కర్లకు రూ.50 వేలు నుంచి రూ.1.20 లక్షలు, హెల్పర్లకు రూ.60 వేలు పెంచింది. మినీ అంగన్‌వాడీ సెంటర్లను ప్రధాన

- మిగతా 2 లో

మీరే నా ప్రచార సారథులు...

- వైఎస్సార్ ఆసరా నిధుల విడుదల సభలో సీఎం జగన్
- బాబు క్యాంపెయినర్లంతా పక్క రాష్ట్రంలోనే...
- ప్రభుత్వంపై విషప్రచారం చేయడమే వారి పని

విశాలాంధ్ర-ఉరవకొండ: వైసీపీ ప్రభుత్వంలో మేలు జరిగిన ప్రతిఒక్కరూ తన క్యాంపెయినర్లు అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. మంగళవారం కర్నూలు జిల్లా ఉరవకొండలో వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం జరిగింది. సీఎం బటన్ నొక్కి రూ.6400 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారత సాధన, సంక్షేమం అమలులో ఆంధ్ర ప్రదేశ్ దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని తెలిపారు. నాలుగేళ్ల క్రితం వైఎస్సార్ ఆసరా అనే గొప్ప కార్యక్రమాన్ని ప్రారంభించుకున్నామన్నారు. మహిళా సాధికారతకు 56 నెలల్లో ఈ ఒక్క పథకానికి సంబంధించి అక్షరాలా రూ.25,570 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. వివక్షకు, లంచాలకు చోటు లేకుండా ప్రతి పథకం రాష్ట్రంలో అమలవుతోందన్నారు. గడిచిన 56 నెలల కాలంలో అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి వివిధ పథకాల కింద సొమ్ము రూ.2.53 లక్షల కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. అమ్మ ఒడి పథకం ద్వారా అక్షరాలా 57 లక్షల మంది తల్లులకు ఇచ్చిన సొమ్ము రూ.26.67 వేల కోట్లు కాగా... వైయస్సార్ చేయూత పథకం ద్వారా 31.23 లక్షల మంది మహిళలకు రూ.14,129 కోట్లు ఇచ్చామని, 31 లక్షల అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడంతో పాటు 22లక్షల ఇళ్లు కూడా

- మిగతా 2 లో

ఇజ్రాయిల్ దళాలకు షాక్

హమాస్ గ్రెనేడ్ దాడిలో 24 మంది సైనికుల మృతి

గాజా: గాజాపై దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ బలగాలకు భారీ షాక్ తగిలింది. సెంట్రల్ గాజాలో జరిగిన దాడిలో 24 మంది ఇజ్రాయిల్ సైనికులు మృతి చెందారు. యుద్ధం మొదలైన తర్వాత ఓ దాడిలో అత్యధిక మంది ఇజ్రాయిల్ సైనికులు చనిపోవడం ఇదే తొలిసారి. ఇజ్రాయిల్ సైన్యం అధికార ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారీ ఈ మేరకు వెల్లడించారు. రెండు భవనాలను పేల్చేసేందుకు ఇజ్రాయిల్ సైనికులు ప్రయత్నిస్తుండగా ఈ దాడి జరిగిందని చెప్పారు. 'ఇజ్రాయెల్ సైనికులు భవనాలకు పేలుడు పదార్థాలు అమర్చుతున్నారు. అదే సమయంలో ఓ హమాస్ మిలిటెంట్ సైనికులకు దగ్గర్లోని ఓ యుద్ధ ట్యాంకుపై రాకెట్ ప్రొపెలెంట్ గ్రెనేడ్‌తో దాడి చేశాడు. దీంతో అనుకున్న సమయానికి ముందే పేలుడు పదార్థాలు బ్లాస్ట్ అయిపోయాయి. ఆ రెండు భవనాలు సైనికులపై కుప్పకూలాయి' అని డేనియల్ వివరించారు. 'సరిహద్దుకు 600 మీటర్ల దూరంలో సైనికులు పని చేస్తున్నారు. హమాస్‌కు చెందిన నిర్మాణాలను ధ్వంసం చేస్తున్నారు. మాకు అందిన సమాచారం ప్రకారం సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఉగ్రవాదులు మా భద్రతా బలగాల ట్యాంకుపై ఆర్‌పీజీ లాంచర్‌ని ప్రయోగించారు. ఈ పేలుడు ధాటికి రెండు భవనాలు కుప్పకూలాయి. ఆ సమయంలో సైనికులు భవనం లోపల, భవనానికి దగ్గరగా ఉన్నారు. భవనాన్ని ధ్వంసం చేసేందుకు మా సైనికులు పెట్టిన మైన్‌ల వల్లే పేలుడు సంభవించిందని ప్రాథమికంగా భావిస్తున్నాం. కానీ, కారణాన్ని నిర్ధరించేందుకు దర్యాప్తు కొనసాగిస్తున్నాం' అని పేర్కొన్నారు. సైనికుల మరణం అత్యంత బాధాకరమని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి యోవ్ గాలంట్ పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సైనికుల త్యాగాల నేపథ్యంలో యుద్ధంలో తమ భవిష్యత్ లక్ష్యాలను సాధించడానికి మరింత దూకుడుతో ముందుకెళ్తామని అన్నారు. ఇజ్రాయిల్ ప్రజల భవిష్యత్‌ను ఈ యుద్ధమే నిర్ణయిస్తుందని పేర్కొన్నారు. సైనిక చర్యను నిలిపివేయాలని ఇజ్రాయిల్‌పై ప్రపంచదేశాల నుంచి ఒత్తిడి నెలకొన్న తరుణంలో ఈ ఘటన జరగడం గమనార్హం. ఘర్షణలకు వ్యతిరేకంగా ఇజ్రాయిల్ లో సోమవారం సైతం ఆందోళనలు జరిగాయి. హమాస్ చెరలో ఉన్న బందీల కుటుంబ సభ్యులు, మద్దతుదారులు పార్లమెంట్ కమిటీ సమావేశంలోకి చొరబడ్డారు. బందీల విడుదలకు హమాస్‌తో ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేశారు.

ఖాన్ యూనిస్‌ను చుట్టుముట్టాం: ఇజ్రాయిల్

గాజాలో ఇజ్రాయిల్ సైన్యం పోరాటాన్ని ఉధృతం చేసింది. రెండో అతిపెద్ద నగరమైన ఖాన్ యూనిస్‌ను తమ బలగాలు చుట్టుముట్టినట్లు ప్రకటించింది. సెంట్రల్ గాజాలో 24 మంది తమ సైనికులు ప్రాణాలు కోల్పోవడంపై ప్రధాని నెతన్యాహు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హమాస్‌పై సంపూర్ణ విజయం సాధించేవరకు పోరాడతామని స్పష్టం చేశారు. హమాస్ చెరలో ఉన్న బందీలను విడిపించుకుంటామన్నారు. కొంతకాలంగా ఖాన్ యూనిస్‌లో తీవ్ర పోరు కొనసాగుతోంది. హమాస్ అగ్రనేతలు ఈ నగరం కింది సొరంగాల్లో దాక్కున్నట్లు ఇజ్రాయిల్ అధికారులు చెబుతున్నారు. ఇది హమాస్ అగ్రనేత యహ్యా సిన్‌వార్ స్వస్థలం. ప్రస్తుతం అతడి ఆచూకీ తెలియాల్సిఉంది. అంతకుముందు స్థానికంగా ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 50 మంది పలస్తీనావాసులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన అమెరికా.. రెండు వర్గాల మధ్య పోరులో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఇజ్రాయిల్‌కు సూచించింది.

పాక్‌ను ఆర్థికసంక్షోభం నుంచి గట్టెక్కించడం కష్టమే: నవాజ్

ఇస్లామాబాద్: తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడం అంత తేలిక కాదని ఆ దేశ మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ అన్నారు. దేశం అంతర్జాతీయ సంస్థలు ఇచ్చే రుణాలపై ఆధారపడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖైబర్ పఖ్తుంఖ్వాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో నవాజ్ మాట్లాడుతూ... పాకిస్తాన్ ఆర్థికంగా పూర్తిగా పతనమైందని, దానిని పునర్నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే... ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేస్తామని, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. తమ హయాంలో డాలర్‌తో పాకిస్తానీ రూపాయి మారకం విలువను 104 వద్దే కట్టడి చేశామని తెలిపారు. ఈసందర్భంగా తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ నేత, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను ఉద్దేశించి విమర్శలు చేశారు. ఈ క్రమంలోనే పాక్ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టడం అంత సులభం కాదని వ్యాఖ్యానించారు. ఇదివరకు కూడా పాక్ దుర్భర స్థితి గురించి నవాజ్ ఈ విధంగానే స్పందించారు. పొరుగున ఉన్న దేశాలు చంద్రుడిపై కాలుమోపాయని, కానీ పాక్ మాత్రం భూమి మీదే ఎదగలేకపోతోందన్నారు. అలాగే ఆర్థిక వ్యవస్థ గురించి మాట్లాడుతూ... 'మన ఆర్థిక కష్టాలకు మనమే కారణం. భారత దేశమో, అమెరికానో కారణం కాదు. 2018 ఎన్నికల్లో మనపై బలవంతపు ప్రభుత్వాన్ని(ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం) రుద్దారు. దానివల్ల ప్రజలు ఇబ్బందులు పడటంతో పాటు ఆర్థిక వ్యవస్థ దిగజారింది' అని పీటీఐ పార్టీని దుయ్యబట్టారు. పాకిస్తాన్‌లో ఫిబ్రవరి 8న ఎన్నికలు జరగనున్నాయి.

హౌతీల చర్యలను సహించబోం: బ్రిటన్

లండన్: హౌతీల చర్యలను ఏమాత్రం సహించమని బ్రిటన్ హెచ్చరించింది. బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ కామెరూన్ మాట్లాడుతూ... ఎర్ర సముద్రంలో స్వేచ్ఛా నౌకాయానానికి హౌతీలు ముప్పుగా మారారని, వారి చర్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. సోమవారం రాత్రి అమెరికా-బ్రిటన్ సంయుక్తంగా యెమెన్‌లోని తిరుగుబాటుదారుల స్థావరాలపై దాడులు చేశాయి. హౌతీలను దెబ్బతీయడానికి జరిపిన ఈ దాడుల్లో తమ దేశానికి చెందిన నాలుగు టైఫూన్ జెట్‌లు పాల్గొన్నాయని తెలిపారు. గత 10 రోజుల్లో హౌతీ రెబల్స్ 12 నౌకలపై దాడులు చేశారన్నారు. ఈ నేపథ్యంలో అమెరికాతో కలిసి వారికి స్పష్టమైన సంకేతాలు పంపేలా చర్యలు తీసుకొన్నామని, తాము చేస్తున్న ఎదురు దాడులు ఫలిస్తున్నాయని తెలిపారు. హౌతీల వాదనను ఆయన తోసిపుచ్చారు. చివరికి యెమెన్ ప్రభుత్వం కూడా వారితో ఏకీభవించడం లేదన్నారు. వివరించారు. అమెరికా, బ్రిటన్ దళాలు సోమవారం అర్ధరాత్రి హౌతీ తిరుగుబాటుదారుల స్థావరాలపై మరోసారి వైమానిక దాడులు నిర్వహించాయి. మొత్తం ఎనిమిది ప్రదేశాలను లక్ష్యంగా చేసుకొని ఇవి జరిగాయి. క్షిపణులు, ఆయుధాగారాలు, డ్రోన్ వ్యవస్థలను విజయవంతంగా ధ్వంసం చేసినట్లు అమెరికా సీనియర్ సైనికాధికారులు ప్రకటించారు. అమెరికా విమాన వాహక నౌక ఐసన్‌హోవర్‌పై నుంచి బయల్దేరిన యుద్ధ విమానాలతోపాటు, మరో యుద్ధనౌక, ఒక జలాంతర్గామి ఈ దాడుల్లో పాల్గొన్నట్లు వెల్లడించారు. దాదాపు 30 వరకు గురితప్పని ఆయుధాలను లక్ష్యాల పైకి ప్రయోగించామని చెప్పారు. తొలిసారి హౌతీల భూగర్భ ఆయుధ గోదాములను కూడా లక్ష్యంగా చేసుకొన్నట్లు వివరించారు. వీటిల్లో తిరుగుబాటుదారులు వాడే అత్యాధునిక ఆయుధాలున్నట్లు వెల్లడించారు. సోమవారం అమెరికా అధ్యక్షుడు జోబైడెన్, బ్రిటన్ ప్రధాని రిషి సునాక్‌తో కలిసి ఎర్ర సముద్రంలో పరిస్థితిపై చర్చలు జరిపారు. అక్కడ ఉద్రిక్తతలు తగ్గి సుస్థిరత ఏర్పడాలని వారు ఆకాంక్షించారు. అదే సమయంలో ప్రజలు, వాణిజ్య నౌకలను రక్షించే క్రమంలో దాడులకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ప్రస్తుతం ఎర్ర సముద్రంలో చేపట్టిన చర్యలకు అమెరికా 'ఆపరేషన్ పొసైడాన్ ఆర్చర్' అని పేరు పెట్టినట్లు సీఎన్ఎన్ కథనంలో పేర్కొంది.

గ్రూప్-1 దరఖాస్తుల గడువు పెంపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: గ్రూప్-1 ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 28వ తేదీ వరకు పొడిగించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) కార్యదర్శి జె.ప్రదీప్‌కుమార్ మంగళవారం ప్రకటన జారీజేశారు. ప్రిలిమినరీ స్ర్కీనింగ్ టెస్ట్‌ను మార్చి 17వ తేదీన యథాతథంగా నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఎలాంటి మార్పు ఉండబోదు. తొలుత గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు దరఖాస్తును అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు గడువు పొడిగించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ విభాగాల్లో గ్రూప్-1 ఉద్యోగాలకు డిసెంబరులో ఏపీపీఎస్సీ ప్రకటన జారీజేసింది.

బీజేపీని శిక్షిద్దాం: ఎస్‌కేఎం

న్యూఢిల్లీ: వ్యవసాయ మంత్రిత్వశాఖకు కేటాయించిన నిధులు తిరిగి తీసుకోవడం ద్వారా అన్నదాతలను ఘోరంగా మోసగించిన కేంద్ర ప్రభుత్వంపై సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) విరుచుకుపడింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం 2014-2022 మధ్యకాలంలో దేశవ్యాప్తంగా లక్షమందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపింది. పాలకు బీజేపీని కఠినంగా శిక్షించాలని రైతులకు పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్‌కేఎం మంగళవారం పత్రికలకు ఓ ప్రకటన విడుదల చేసింది. 2018-19 నుంచి ఐదేళ్లలో కేంద్ర వ్యవసాయమంత్రిత్వశాఖకు కేటాయించిన రూ.1,05,543.71 కోట్లను ప్రభుత్వం వెనక్కి తీసుకుందని, ఆ మంత్రిత్వశాఖే వివరాలు వెల్లడించిందని ఎస్‌కేఎం విమర్శించింది. '2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు రైతులను రుణ విముక్తులను చేస్తానని బీజేపీ హామీ ఇచ్చింది. గడచిన పదేళ్లలో బడా కార్పొరేట్ సంస్థల బకాయిలు రూ.14.56 లక్షల కోట్లను మోదీ సర్కారు రద్దు చేసింది. రైతులకు సంబంధించి కనీసం ఒక్క రూపాయి కూడా రద్దు చేయలేదు' అని ఆరోపించింది. ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం 2014-2022 మధ్య మోదీ ప్రభుత్వ హయాంలో 1,00,474 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపింది. తిరిగి వెనక్కి తీసుకున్న నిధులను మోదీ ప్రభుత్వం రైతులకు ఉపయోగించి ఉంటే...వారి ప్రాణాలు కాపాడినట్లు అయ్యేదని పేర్కొంది. గిట్టుబాటు ధర కోసం మద్దతు ధర కేటాయింపులు పెంచాలని, వ్యవసాయ రంగానికి సంబంధించి ప్రాతిపదిక సదుపాయాలు అభివృద్ధి చేయాలని, నీటిపారుదల శాఖను విస్తరించాలని డిమాండ్ చేసింది. రైతు ప్రయోజనాలను దెబ్బతీసే నేరపూరిత చర్యలను ఎస్‌కేఎం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపింది.

సమ్మె విరమణ

(మొదటిపేజీ తరువాయి)

సెంటర్లుగా, సర్వీస్‌లో చనిపోయిన అంగన్‌వాడీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, వైయస్సార్ బీమా అమలు చేస్తామని, మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని, హెల్పర్ల పదోన్నతి వయస్సు 45 నుండి 50 ఏళ్లకు పెంచడానికి ప్రభుత్వం అంగీకరించింది. పెండింగ్ టీఏ బిల్లుల చెల్లింపునకు ఆమోదం తెలిపింది. ఉద్యోగ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం, సూపర్‌వైజర్ పోస్టులకు పరీక్ష రాసి పెండింగ్‌లో ఉన్న 164 పోస్టులు ఏప్రిల్ నాటికి అమలు చేస్తామని, నాలుగు యాప్‌లను ఒక యాప్‌గా మార్చడం, వేతనంతో కూడిన మెడికల్ లేవు, వైయస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీల పెంపు, గ్యాస్, తదితర సమస్యలు పరిష్కారానికి కమిటీ వేసి చర్చించి నిర్ణయిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సమ్మె కాలానికి జీతాలు చెల్లించడానికి, పెట్టిన కేసులు ఎత్తివేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. కక్షసాధింపు చర్యలకు పాల్పడబోమని స్పష్టంచేసింది. అంగీకరించిన అన్ని డిమాండ్లకు సంబంధించి మూడు రోజుల్లో మినిట్స్ కాపీని అందిస్తామని ప్రభుత్వం తెలిపింది. వీటన్నింటిపై లిఖితపూర్వకంగా ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో తాము సమ్మె విరమణకు అంగీకరించామని నాయకులు తెలిపారు. సరోజనమ్మ, సరళ, నాగమల్లేశ్వరి, జేఏసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజీనామా కలకలం

(మొదటిపేజీ తరువాయి)

రోజుల్లో స్పష్టత రానుంది. ఇప్పటికే ప్రకటించిన నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలపై పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. చిలకలూరిపేట, ప్రత్తిపాడు, రేపల్లె, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జిల మార్పుపై మరోసారి అధిష్ఠానం సర్వే నిర్వహించి, తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిసింది. ఐదో జాబితాతోపాటు ఆ నాలుగు స్థానాల ఇన్‌చార్జిలను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి వివిధ ప్రాంతాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు వచ్చారు. డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఎంపీలు అవినాశ్‌రెడ్డి, మోపిదేవి వెంకటరమణ, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేశ్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తదితరులు క్యాంపు కార్యాలయానికి వచ్చి ముఖ్యనేతలను కలిశారు. సీఎం జగన్ ఉత్తరాంధ్ర కేంద్రంగా భీమిలిలో నిర్వహించే ప్రాంతీయ సమావేశానికి ముందే ఇన్‌చార్జిల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసేందుకు కసరత్తు వేగవంతం చేశారు. ఐదో జాబితాలో పార్లమెంట్ అభ్యర్థుల పేర్లు అత్యధికంగా ఉన్నాయి. ఒంగోలు, నరసరావుపేట, గుంటూరు, మచిలీపట్నం, కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, నంద్యాల తదితర పార్లమెంట్ స్థానాలకు ఇన్‌చార్జిలను ప్రకటించాల్సి ఉంది. కర్నూలు పార్లమెంట్ ఇన్‌చార్జిగా నియమించిన మంత్రి గుమ్మనూరు జయరామ్ తీవ్ర అసంతృప్తితో పార్టీ వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. అక్కడ ప్రత్యామ్నాయంగా మరో ఇన్‌చార్జి పేరును పరిశీలిస్తున్నారు.

అడుగడుగునా ఆటంకాలు

గువహతి: రాహుల్‌గాంధీ భారత్ జోడో న్యాయయాత్రకు అసోంలో అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. రాహుల్ యాత్రపై అసోం ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోంది. యాత్రకు అనుమతి ఇవ్వకుండా అడ్డుకుంటున్నది. అందులో భాగంగా రాహుల్ యాత్ర అసోం రాజధాని గువహతిలోకి ప్రవేశించకుండా పోలీసులు అడ్డుకున్నారు. దీనిపై ఆగ్రహం చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు బారికేడ్లు తోసివేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ట్రాఫిక్ జామ్ నివారించేందుకు యాత్రను నగరంలోకి అనుమతించడం లేదని ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ చెప్పుకొచ్చారు. ఐదువేలకు పైగా కాంగ్రెస్ కార్యకర్తలు గువహతికి చేరుకున్నారు. పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను బారికేడ్లతో అడ్డుకునేందుకు యత్నించారు. ఆగ్రహించిన కార్యకర్తలు బారికేడ్లు దాటుకుని దూసుకువెళ్లారు. ఈ సందర్భంగా పోలీసులకు, కార్యకర్తలకు మధ్య వాగ్వివాదం జరగడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నగర శివారుల్లో కాంగ్రెస్ కార్యకర్తలనుద్దేశించి రాహుల్‌గాంధీ మాట్లాడారు. ఇదే మార్గంలో బజరంగ్ దళ్ యాత్ర చేపట్టిందని, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా ర్యాలీ నిర్వహించారని, అప్పుడు లేని ఇబ్బందులు ఇప్పుడెందుకు వచ్చాయని రాహుల్ ప్రశ్నించారు. తమ యాత్రకు మాత్రమే బారికేడ్లు ఎందుకు పెట్టారని నిలదీశారు. తాము బారికేడ్లు మాత్రమే దాటామని, చట్టాన్ని అతిక్రమించలేదని స్పష్టం చేశారు. తమను బలహీనులుగా భావించవద్దని, ఇది కాంగ్రెస్ కార్యకర్తల శక్తి అని హెచ్చరించారు. తమ కార్యకర్తలు సింహాల వంటి వారని చెప్పారు. యూనివర్సిటీలోకి వెళ్లకుండా తమను అడ్డుకున్నారని, కానీ విద్యార్థులు తన మాటలు వింటున్నారని చెప్పారు. కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరికీ భయపడబోరని చెప్పారు. అసోంలో బీజేపీని ఓడిస్తామని, రాష్ట్రంలో తదుపరి ప్రభుత్వం కాంగ్రెస్‌దేనని దీమా వ్యక్తంచేశారు. అదే సమయంలో తమ విధులు సక్రమంగా నిర్వహించారని పోలీసులను ప్రశంసించారు. పోలీసు అధికారులు సక్రమంగా నిధులు నిర్వహించారని, ప్రభుత్వ పెద్దల ఆదేశాలు అమలు చేశారని, తాము పోలీసులకు వ్యతిరేకం కాదన్నారు. అత్యంత అవినీతి ముఖ్యమంత్రికి తాము వ్యతిరేకమని, ఆయనతోనే తమ పోరాటమని రాహుల్ స్పష్టంచేశారు. కాగా, ప్రజలను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేస్తున్న రాహుల్‌పై కేసు నమోదు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ పోలీసులను ఆదేశించారు.

అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవాన్ని రాజకీయ కార్యక్రమంగా రాహుల్‌గాంధీ విమర్శించారు. దీనిపై ప్రజలలో గొప్ప కదలిక వచ్చినట్లు చేసుకుంటున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. రామమందిర ప్రారంభోత్సవరం మరుసటి రోజు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. సీఎం హిమంత విశ్వశర్మపై విమర్శలు గుప్పిస్తూ భారత్ జోడో న్యాయయాత్రకు అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తు న్నారన్నారు. ఇలాంటి చర్యలు తన యాత్రకే లబ్ది చేకూరుస్తాయని, మరింత ప్రచారం లభిస్తుందని రాహుల్ చెప్పారు. రాహుల్ మంగళవారం దాందోమలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అసోం ముఖ్యమంత్రి దేశంలోనే అత్యంత అవినీతిపరుడని, రాష్ట్రంలో తాను ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఇదే విషయం చెబుతున్నారని రాహుల్ తెలిపారు. రాష్ట్రంలో అవినీతికి పగ్గాలు లేవని, నిరుద్యోగం పెరిగిందని, ధరలు ఆకాశాన్ని అంటాయని, రైతులు అల్లాడుతున్నారని, యువతకు ఉద్యోగ అవకాశాలు కనిపించడం లేదని విమర్శించారు. భాగస్వామ్యం, యువత, కార్మికులు, మహిళలు, రైతులకు న్యాయం కోసం యాత్ర చేపట్టామని వివరించారు.

మేఘాలయ వర్సిటీలోకి అనుమతి నిరాకరణ

మేఘాలయ యూనివర్సిటీలోకి కేంద్రం అనుమతి నిరాకరించడంపై రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. విద్యార్థులతో ముఖాముఖిపై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సూచనల మేరకే అధికారులు ఆంక్షలు విధించారని మండిపడ్డారు. అసోం-మేఘాలయ సరిహద్దులో జోడో న్యాయ యాత్ర చేపడుతున్న బస్సు నుండి విద్యార్థులు, కార్యకర్తలను ఉద్దేశించి మంగళవారం రాహుల్ ప్రసంగించారు. మేఘాలయలోని సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ విద్యార్థులు, పౌర సమాజ సభ్యులు, పార్టీ ప్రతినిధులతో వేర్వేరుగా చర్చలు జరపాల్సి ఉందని, అయితే యూనివర్సిటీ అనుమతిని వెనక్కి తీసుకుందని అన్నారు. అసోం ముఖ్యమంత్రి కార్యాలయం నుండి హోంమంత్రి యూనివర్సిటీ అధికారులకు ఆదేశాలు పంపారని రాహుల్ విమర్శించారు. 'నేను మీ యూనివర్సిటీకి వచ్చి ప్రసంగించాలని, మీ మాటలు వినాలని భావించాను. కానీ కేంద్రహోంమంత్రి అసోం ముఖ్యమంత్రికి ఫోన్‌చేసి, సీఎంఓ నుండి యూనివర్సిటీకి ఫోన్ చేసి రాహుల్ గాంధీని విద్యార్థులతో మాట్లాడేందుకు అనుమతించవద్దు' అని చెప్పారని అన్నారు. రాహుల్ గాంధీని అనుమతిస్తారా లేదా అనేది ముఖ్యం కాదని, మీకు నచ్చిన వారి ప్రసంగాలు వినేందుకు మీకు అవకాశం ఉండాలని, మీరు కోరుకున్నట్లుగా జీవించే స్వేచ్ఛ మీకు ఉండాలని విద్యార్థులను ఉద్దేశించి రాహుల్ అన్నారు. ఈ ఆంక్షలు కేవలం అసోంలోనే కాదని, భారతదేశంలోని ప్రతి పాఠశాల, కళాశాల, యూనివర్సిటీలోనూ ఇదే పరిస్థితి ఉందని, ఈ దేశంలో విద్యార్థులు తమ సొంత ఆలోచనలు కలిగి ఉండకూడదా అని మండిపడ్డారు.

అమెరికాలో పెరిగిన ఉద్యోగుల తొలగింపులు

వాషింగ్టన్: అమెరికాను ఆర్థిక కష్టాలు చుట్టుముడుతున్నాయి. ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల పెంపు, ద్రవ్యోల్బణం వంటి అంశాలు జాబ్ మార్కెట్ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా చిన్న చిన్న స్టార్టప్స్ నుంచి బడా బడా టెక్ కంపెనీల వరకూ అందరూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. దీంతో 2024 జాబ్ మార్కెట్ మరింత దారుణంగా తయారయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. అమెరికా కంపెనీలు గత ఏడాది దాదాపు 7,21,677 మంది ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించాయని ప్రముఖ నివేదిక వెల్లడించింది. 2022లో నమోదైన 3,63,832 తొలగింపులతో పోలిస్తే ఇది 98 శాతం అధికమని పేర్కొంది. మెటా, అమెజాన్ సహా టెక్ రంగంలోని కంపెనీలే దాదాపు 1,68,032 మందికి ఉద్వాసన పలికాయని 'ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్' నివేదిక తెలిపింది. ఈ సంఖ్య వార్షిక ప్రాతిపదికన 73 శాతం పెరిగింది. కంపెనీలన్నీ వ్యయ నియంత్రణ లక్ష్యాలతో 2024లోకి అడుగుపెట్టాయని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల తొలగింపుల సమస్య ఈ ఏడాది కూడా కొనసాగుతుందని అంచనా వేసింది. కొత్త నియామకాలు సైతం నెమ్మదిస్తాయని తెలిపింది. కృత్రిమ మేధ, కొనుగోళ్లు-విలీనాలు, వనరుల క్రమబద్ధీకరణ నేపథ్యంలో టెక్ రంగంలో ఉద్యోగాల కోతలు అధికంగా ఉండొచ్చని తెలిపింది. నివేదిక ప్రకారం.. గత ఏడాది రిటైల్ రంగంలోని కంపెనీలు 78,840 మంది ఉద్యోగులను తొలగించాయి. వార్షిక ప్రాతిపదికన ఇవి 274 శాతం పెరిగాయి. ఆస్పత్రులు సహా ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తుల తయారీ సంస్థల్లో తొలగింపులు 91 శాతం పెరిగి 58,560కు చేరాయి. అమెరికాలో ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చితులే ఉద్యోగుల తొలగింపులకు కారణమని 'ఛాలెంజర్, గ్రే అండ్ క్రిస్మస్' నివేదిక అభిప్రాయపడింది. పలు స్టోర్లు మూతపడటం, వ్యాపారాల దివాలా, కృత్రిమ మేధ కూడా ఉద్యోగుల ఉద్వాసనకు కారణమవుతున్నట్లు తెలిపింది. మరోవైపు 2023లో 34 శాతం యాజమాన్యాలు తమ ఉద్యోగులకు బోనస్‌లు ఇవ్వలేదు.

రాజ్యసభ బెర్తులపై వైసీపీ గురి!

(మొదటిపేజీ తరువాయి)

కూడా సీటు గల్లంతవుతోంది. దీంతో వైసీపీలో ప్రస్తుతం అసంతృప్తి రగులుతోంది. కొందరు పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే రఘురామ కృష్ణరాజుతో పాటు, బాలశౌరి, సంజీవ్ కుమార్, లావు కృష్ణదేవరాయలు మొత్తం నలుగురు ఎంపీలు పార్టీకి, ఎంపీ పదవులకు రాజీనామా చేశారు. అలాగే శాసనసభ్యుల్లో ఆనం రామనారాయణ రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, కొలుసు పార్థసారథి పార్టీకి గుడ్‌బై చెప్పారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారంటూ పూతలపట్టు, శింగనమల, నందికొట్కూరు, తిరువూరు శాసన సభ్యులు ఎంఎస్ బాబు, జొన్నలగడ్డ పద్మావతి, ఆర్థర్, రక్షణ నిధిలు వైసీపీ అధిష్ఠానంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వీరితోపాటు విశాఖ ఎమ్మెల్సీ వంశీకృష్ణ యాదవ్, కడప శాసనమండలి సభ్యులు సి.రామచంద్రయ్య కూడా వైసీపీలో ఇక ఉండలేమంటూ రాజీనామాలు సమర్పించారు. వీరి బాటలో మరికొంతమంది కూడా రాజీనామా చేసే అవకాశం కనపడుతోంది. ఈ పరిణామాలను గమనించిన వైసీపీ అధిష్ఠానం అప్రమత్తమైంది. అసంతృప్తి వాదులను బుజ్జగించే చర్యలకు ఉపక్రమించింది. మరలా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం కోసమే మార్పులు చేయాల్సి వస్తోందని, ఎవరిమీద కోపంతో కాదని నచ్చజెప్పే ప్రయత్నం చేస్తోంది. మరలా ప్రభుత్వం వస్తే అందరికీ న్యాయం చేయడానికి అవకాశం కలుగుతుందని, అసలు ప్రభుత్వమే రాకపోతే అందరం నష్టపోతామని చెపుతూ అసంతృప్త వాదులను అధిష్ఠానం బుజ్జగిస్తోంది. ఏప్రిల్ 2వ తేదీ నాటికి వైసీపీకి చెందిన రాజ్యసభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, టీడీపీకి చెందిన కనకమేడల రవీంద్రకుమార్, బీజేపీకి చెందిన సీఎం రమేష్‌లు పదవీ విరమణ చేయనున్నారు. ఈ మూడు స్థానాలను ఎట్టిపరిస్థితుల్లో కైవసం చేసుకోవాలన్న పట్టుదలతో సీఎం ఉన్నారు. అందుకోసం వ్యూహాత్మక అడుగులు వేస్తున్నారు. దీనిలో భాగంగానే విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 2021 ఫిబ్రవరి 12వ తేదీన రాజీనామా చేసిన విశాఖ టీడీపీ శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు రాజీనామాను, మూడేళ్లుగా పెండింగ్‌లో ఉంచి మంగళవారం అకస్మాత్తుగా స్పీకర్ ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే పార్టీని వీడిన ఎమ్మెల్యేలకు కూడా శాసనమండలి కార్యదర్శి వారం రోజుల్లో రాజీనామాపై వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. వైసీపీ నుంచి సస్పెండ్ అయిన నలుగురు ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం నోటీసులు ఇచ్చింది. ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని ఇప్పటికే స్పీకర్‌కు వైసీపీ నేతలు ఫిర్యాదు చేశారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి స్పీకర్ నోటీసులు పంపించారు. గతంలో ఈ ఎమ్మెల్యేలపై వచ్చిన ఫిర్యాదులకు సమాధానం ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. తమకు సమయం కావాలని నలుగురు ఎమ్మెల్యేలు కోరినట్లు తెలుస్తోంది. ఈనెల 26వ తేదీ వరకు సమయం ఇస్తూ ఎమ్మెల్యేలకు స్పీకర్ కార్యాలయం లేఖ రాసింది. నిబంధనలకు విరుద్ధంగా టీడీపీకి మద్దతిస్తూ వారి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారన్న ఫిర్యాదులపై వివరణ ఇవ్వాలని అసెంబ్లీ అధికారులు కోరారు. వీరితో పాటు టీడీపీ తరపున ఎన్నికై వైసీపీకి మద్దతు ఇస్తున్న మద్దాల గిరి, వల్లభనేని వంశీ, కరణం బలరాం, వాసుపల్లి గణేష్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీడీఎల్పీ నేత డోలా బాల వీరాంజనేయస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారికి కూడా స్పీకర్ కార్యాలయం నోటీసులు జారీ చేసింది. అయితే వీరిపై చర్యలు తీసుకునే అవకాశం లేదని టీడీపీ నేతలు పేర్కొంటున్నారు. రాజ్యసభ ఎన్నికలకు టీడీపీ సభ్యుల సంఖ్యాబలం తగ్గించేందుకు కుట్ర పన్నుతోందని, అందుకే మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న రాజీనామాను ఇప్పుడు ఆమోదించారని వారు ఆరోపిస్తున్నారు. మొత్తానికి సార్వత్రిక ఎన్నికలకు ముందే జరుగనున్న రాజ్యసభ ఎన్నికల వేడి ఇప్పటినుంచే మొదలైంది.

ఏఎన్ఎం సమస్యలు పరిష్కరించండి

వెంకటసుబ్బయ్య డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ మెడికల్ ఏఎన్ఎంల సమస్యలు తక్షణం పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎస్.వెంకటసుబ్బయ్య డిమాండ్ చేశారు. గొల్లపూడిలోని మెడికల్ ఫ్యామిలీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతిని గ్రామ, వార్డు సచివాలయాల మెడికల్ ఏఎన్ఎం యూనియన్ అధ్వర్యంలో మంగళవారం కలిసి సమస్యలపై చర్చించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.లీలావతి మాట్లాడుతూ మెడికల్ డైరెక్టర్‌కి జాబ్ చార్ట్, శనివారం సెలవు, యూనిఫామ్ అలవెన్స్, ఎస్ఆర్‌కు సంబంధించి క్లుప్తంగా వివరించామని చెప్పారు. తమకు ఈ సౌకర్యాలు కల్పించాలని, అదేవిధంగా పని ఒత్తిడి తగ్గించాలని, రెండు డిపార్ట్‌మెంట్ల మధ్య నలిగిపోతున్నామన్నారు. ఒకవైపు డీఎం, మరోవైపు మున్సిపాలిటీ అధికారులు పనిచెప్పడం వల్ల పనిభారం పెరిగిందన్నారు. ఈ సమస్యలపై మెడికల్ డైరెక్టర్ స్పందించి తమ సమస్యలన్నీ పై అధికారుల దృష్టికి తీసుకెళ్తానని, కులగణన బాధ్యతలు గ్రామ, వార్డు సచివాలయాల ఏఎన్ఎంలకు అప్పగించవద్దని ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. పరిమళ, రాజేశ్వరి, మెడికల్ గ్రామ, వార్డు సచివాలయం ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

మీరే నా ప్రచార సారథులు...

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించామన్నారు. విద్యాదీవెన కింద రూ.11,900 కోట్లు, వసతి దీవెన కింద రూ.4275 కోట్లు, కాపు నేస్తం కింద రూ.2.28 వేల కోట్లు, ఈబీసీ నేస్తం కింద రూ.1,257 కోట్లు ఇచ్చామని తెలిపారు. పెన్షన్ అందుకుంటున్న పేదలు 66.34 లక్షల మంది అర్హులు ఉన్నారని, పెన్షన్ల సొమ్ము కింద రూ.84,730 కోట్లు ఇప్పటివరకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. జగనన్న తోడు ద్వారా ఇచ్చిన వడ్డీ లేని రుణాలు రూ.2,610 కోట్లు కాగా, చేదోడు ద్వారా రూ.404 కోట్లు ఇచ్చామన్నారు. 'గతంలో కూడా ఒక పాలన ఉండేది... అప్పుడు కూడా ఇదే రాష్ట్రం, ఇదే బడ్జెట్. మారిందల్లా కేవలం ముఖ్యమంత్రి మాత్రమే. మిగిలినవన్నీ మామూలే. అప్పుల వృద్ధి రేటు కూడా అప్పటికన్నా ఈ ప్రభుత్వంలో తక్కువే. మరి మీ బిడ్డ ప్రభుత్వంలో ప్రతి అక్కచెల్లెమ్మ ముఖాన చిరునవ్వు ఎలా కనిపిస్తోంది. గతంలో ఎందుకు ఈ మంచి జరగలేదనేది ఆలోచన చేయమని అడుగుతున్నా. కారణం ఒక్కటే. గతంలో దోచుకో, పంచుకో, తినుకో. ఈరోజు మీ బిడ్డ ప్రభుత్వంలో బటన్ నొక్కుతున్నాడు. నేరుగా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి డబ్బులు పోతున్నాయి' అని సీఎం జగన్ అన్నారు. ఫిబ్రవరి 5వ తేదీ వరకు పొదుపు సంఘాల అక్కచెల్లెమ్మలకు రూ.6,400 కోట్లు ఇచ్చే కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా పండుగలా జరుగుతుందన్నారు. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తానని, సీఎం అయ్యాక మోసం చేశాడని జగన్ ఆరోపించారు. రాష్ట్రంలో పేద ప్రజలకు జరుగుతున్న మంచిని చూడలేని కొన్ని మీడియా సంస్థలు, తెలుగుదేశం, దత్తపుత్రుడు, చంద్రబాబు సొంత వదిన, మరికొన్ని పార్టీలు ఒక జతకట్టి విష ప్రచారం చేస్తున్నాయని తెలిపారు. చంద్రబాబు క్యాంపెయినర్లంతా పక్క రాష్ట్రంలోనే ఉంటారన్న జగన్... పవన్ కల్యాణ్ సైతం చంద్రబాబుకు స్టార్ క్యాంపెయినర్ అని పేర్కొన్నారు. చంద్రబాబు వదిన కూడా ఆయనకు స్టార్ క్యాంపెయినరే అని ఆరోపించారు. ఆమె పక్క పార్టీలోకి వెళ్లినా క్యాంపెయిన్ మాత్రం చంద్రబాబుకే అని అన్నారు. అదే విధంగా రాష్ట్రాన్ని విడగొట్టిన పార్టీలోకి వెళ్లినవాళ్లు కూడా బాబు క్యాంపెయినర్లే అని సీఎం జగన్ పరోక్షంగా షర్మిలపై మండిపడ్డారు. బీజేపీలో తలదాచుకున్న పసుపు కమలాలు బాబు క్యాంపెయినర్లే అన్న సీఎం, అనేక పార్టీల్లో చంద్రబాబు బినామీలు స్టార్ క్యాంపెయినర్లుగా ఉన్నారని ధ్వజమెత్తారు. అయితే వైసీపీ ప్రభుత్వ పథకాల లబ్ధిదారులే తన స్టార్ క్యాంపెయినర్లు అని తెలిపారు. జగన్‌కు మాత్రం దేవుడు, ప్రజలు అండగా ఉన్నారని, ప్రజల గుండెలతో మాత్రమే జగన్ జత కడతాడని తెలిపారు. రాబోయే ఎన్నికలలో ఇలాంటి వారికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉషశ్రీ చరణ్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్, బైక్ ర్యాలీ

మోదీ సర్కారు అప్రజాస్వామిక చర్యలు నిరసిద్దాం

ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం పిలుపు

విశాలాంధ్ర-విజయవాడ: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా, కార్మికసంఘాల ఐక్య వేదిక అధ్వర్యంలో జనవరి 26న జిల్లాలలో ట్రాక్టర్, బైక్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో రైతాంగానికి పిలుపునిచ్చారు. రైతుసంఘ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోదీ ప్రభుత్వం మోసగిస్తున్నదని, వ్యవసాయ, పారిశ్రామిక, రవాణా, ఖనిజ, సకల సంపదలను అంబానీ, అదానీ తదితర కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతోందని విమర్శించారు. అందుకు అడ్డుగా ఉన్న చట్టాలను మారుస్తూ...ప్రశ్నించిన వారిపై కేసులు, వేధింపులు సాగిస్తున్నదని, ప్రజాతంత్ర హక్కులను, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నదని, రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తోందని ఆరోపించారు. మోదీ పాలనలో అదానీ, అంబానీలు ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత కార్మికులు అప్పులపాలై ఈ పదేళ్లలో 1.50 లక్షలమంది బలవన్మరణానికి పాల్పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత 26 శాతం ఆత్మహత్యలు పెరిగాయని వివరించారు. ఈ విధానాలకు నిరసనగా ర్యాలీ జరుగుతుందన్నారు. ఇక రైతాంగం విషయంలో స్వామినాథన్ కమిటీ సిఫార్సుల మేరకు అన్ని పంటలకు సీ2+50 ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని, కేరళ విధానాన్ని అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల రుణాలు మాఫీ, రద్దు ఉపశమన చట్టం చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని, ఉపాధి హామికి కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించి 200 రోజులకు పెంచి కూలి రూ.600లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆహారభద్రత చట్టాన్ని పటిష్ట పరచాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలని, కడపలో ఉక్కుఫ్యాక్టరీ నిర్మించాలని, విద్యుత్ చట్ట సవరణ బిల్లును ఉపసంహరించాలని, స్మార్ట్ మీటర్ల బిగింపును నిలిపివేయాలని, భూ హక్కుల చట్టం 22ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిధులు, నిర్వాసితులకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలని, కరువు, తుపాను నష్టపరిహారాలు, ఇన్‌పుట్ సబ్సిడీ వెంటనే ఇవ్వాలన్నారు. అందరికీ పంటల బీమా కల్పించాలని, సాగులో ఉన్న కౌలు రైతులకే నష్టపరిహార బీమా సౌకర్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల చట్టం సవరణలు ఉపసంహరించాలని, ఆదివాసుల హక్కులు కాపాడాలన్నారు. రైతుల న్యాయమైన డిమాండ్ల కోసం జనవరి 26 రిపబ్లిక్ డే రోజున దేశవ్యాప్తంగా ట్రాక్టర్, బైక్ ర్యాలీలు జరపాలని సంయుక్త కిసాన్‌మోర్చ, కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చాయని జి.ఈశ్వరయ్య, కేవీవీ ప్రసాద్ తెలిపారు.

ఉరవకొండలో సీపీఐ నేతల అక్రమ నిర్బంధం

సీఎంకు అర్జీలివ్వబోతే అరెస్టు చేస్తారా?

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనంతపురం జిల్లా పర్యటనలో భాగంగా ఉరవకొండ కు వచ్చిన నేపథ్యంలో సీపీఐ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ ఇతర ప్రజా సంఘాల నాయకులు ప్రజా, రైతు సమస్యలపై ఆయనను కలిసి వినతి పత్రాలు అందజేసే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా మార్గమధ్యలోనే వారిని పోలీసులు అరెస్టు చేసి వజ్రకరూరు, ఇతర పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, శ్రామికులు, విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గతంలో అనేక సందర్భాల్లో సీఎం జగన్ జిల్లాకు వచ్చి హామీలు ఇచ్చినప్పటికీ ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదని ఘాటుగా విమర్శించారు. జిల్లాలో పంటల పండక, పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు దుర్భిక్షంలో పడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అతివృష్టి అనావృష్టి తో జిల్లాలో 31 మండలాల్లో కరువు తీవ్రంగా తాండవిస్తుంటే ప్రభుత్వం కేవలం 28 మండలాలు మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించడం దారుణమన్నారు. జిల్లాలో ఏర్పడ్డ కరువు దృష్ట్యా అన్నమో రామచంద్రా అంటూ రైతులు సొంత గ్రామాలు వదలి ఇతర రాష్ట్రాలకు వలసలు పోతున్నారని విచారం వ్యక్తంచేశారు. బెలుగుప్ప, బొమ్మనహాల్, ఎల్లనూరు మండలాల కరువును వైసీపీ ప్రభుత్వం చూసి చూడనట్టు వదిలేసిందని విమర్శించారు. గత నెల 12 న కేంద్ర కరువు బృందాల్లో 11 మంది ఐఏఎస్ అధికారులు, టీం లీడర్ పంకజ్ యాదవ్ అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో పర్యటించి పంటల పరిస్థితిని తూతూ మంత్రంగా అధ్యయనం చేసి రైతులను అయోమయానికి గురి చేశారని మండిపడ్డారు. కేంద్ర కరువు బృందం రైతులను ఆదుకోవడానికి ఎటువంటి ప్రతిపాదనలు పంపారో అర్థం కాని స్థితి ఉందని, బాధిత రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టిందో ఇప్పటికీ తెలియదని విరుచుకు పడ్డారు. గోరుచుట్టు పై రోకటి పోటులా తుంగభద్ర నుండి 32.5 టీఎంసీల నీరు రావాల్సి ఉండగా... ఉన్న పళంగా నవంబర్‌లోనే నీటి సరఫరా బంద్ చేయడం దుర్మార్గమన్నారు. ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం గుంతకల్ బ్రాంచ్ కెనాల్ ఆయుకట్టు కింద మొత్తం 30 వేల ఎకరాల్లో మిర్చి పంట సాగు చేస్తున్నారని.. ఎకరానికి ఒక లక్ష నుండి 1 లక్షా 50 వేల రూపాయలు పెట్టుబడి పెడుతున్నారన్నారు. మొత్తంగా 450 కోట్ల రూపాయలు పెట్టుబడి అవుతోందని... అయితే నవంబర్‌లోనే సాగునీరు బంద్ చేశారని అసహనం వ్యక్తం చేశారు. గుంతకల్ బ్రాంచ్ కెనాల్ కు జనవరి ఆఖరు వరకు సాగు నీరు కొనసాగించాలని రైతులు, రైతు సంఘాలు ఆందోళనలు చేసినా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యానికి పంటలన్నీ ఎండిపోతున్నాయని... రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి వంకలు, బావులు, చెరువులు,చెక్ డాముల్లో నిలువ ఉన్న నీటిని ట్యాంకర్లు,ఎడ్ల బండ్లపై సిన్‌టిక్స్ ట్యాంకుల ద్వారా తరలిస్తున్నారని ఏకరువు పెట్టారు. ప్రభుత్వం స్పందించి హంద్రీ నీవా సుజల స్రవంతి నుండి 100 క్యూసెక్కుల సాగునీరు జీబీసికి వదిలి రైతులు వేసిన 30 వేల ఎకరాల పంటను కాపాడాలని... లేనిపక్షంలో రైతులకు ఆత్మహత్యలే శరణ్యమని విచారం వ్యక్తంచేశారు. అరెస్టయిన వారిలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మల్లికార్జున,నియోజక వర్గం సహాయ కార్యదర్శి మనోహర్ , ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయ్ స్వామి, అధ్యక్షుడు రమణయ్య, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోషకుమార్, అధ్యక్షుడు ఆనంద్, ఉపాధ్యక్షుడు, మోహన్ ఉన్నారు.

మారువేషంలో సీఎంను కలిసేందుకు జాఫర్ యత్నం

రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఉరవకొండ పర్యటనకు వస్తున్న సందర్భంగా జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇవ్వడానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ అనంతపురం నుంచి ఉరవకొండకు బురఖా ధరించి మారువేషంలో వచ్చారు. సీఎం కాన్వాయ్ వస్తున్న సందర్భంగా ముందుకు వెళుతున్న జాఫర్ ను ఉరవకొండ పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు.

ఆప్కోలో ఆధునిక చేనేత వస్త్ర శ్రేణి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆప్కో చేనేత వస్త్ర శ్రేణిలో ఆధునిక వెరైటీలకు శ్రీకారం చుట్టే క్రమంలో ప్రత్యేక వస్త్రాలను అందుబాటులో ఉంచామని చేనేత, జౌళి శాఖ కమిషనర్, ఆప్కో ఎండీ ఎం.ఎం.నాయక్ తెలిపారు. మంగళవారం ఆప్కో కేంద్ర కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేస్తూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ సంస్థల సౌజన్యంతో యువతను ఆకర్షించే విధంగా వీటికి రూపకల్పన చేస్తున్నామన్నారు. ఆ పరంపరలో భాగంగా మన్యం జిల్లా నారాయణపురం సొసైటీ నుంచి తయారు చేసిన బొబ్బిలి ప్రింటెండ్ కాటన్ చీరలు ఆప్కో షోరూమ్‌లలో అందుబాటులో ఉంచామన్నారు.

తక్కువ బరువు, మెత్తదనంతో చేతి మగ్గంపై తయారయిన ఈ చీరలు ఆధునికతకు ఆనవాలుగా ఉంటాయన్నారు. భారతీయ వారసత్వ కళా సంపదగా ఉన్న చేనేతను ప్రతి ఒక్కరూ ఆదరించి, ఆ కళను పరిరక్షించుకోవలసిన అవసరం ఉందని నాయక్ వివరించారు. చేనేత వస్త్ర వినియోగాన్ని పెంపొందించి, అందరికీ అనుకూలంగా అందుబాటు ధరలలో చేనేత వస్త్రాలను సిద్ధం చేయాలన్న ధ్యేయం మేరకు చేనేత జౌళి శాఖ పని చేస్తోందన్నారు. సంక్రాంతి వేడుకలను పురస్కరించుకుని అందిస్తున్న 30 శాతం రాయితీని గణతంత్ర దినోత్సవ వేడుకల నేపథ్యంలో జనవరి నెలాఖరు వరకు పొడిగించామని, కొన్ని ప్రత్యేక వెరైటీలపై 50 శాతం రాయితీ కూడా అమలు చేస్తున్నామని నాయక్ పేర్కొన్నారు.

బీసీ కమిషన్ మెంబర్‌గా డాక్టర్ మారేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న డాక్టర్ ఎన్.మారేశ్‌ను రాజ్యాంగబద్ధమైన బీసీ కమిషన్ మెంబర్‌గా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమించింది. దీనిపై డాక్టర్ ఎన్.మారేశ్ స్పందింస్తూ తనపై నమ్మకంతో బీసీ కమిషన్ మెంబర్‌గా అవకాశం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనతోపాటు మరో ఇద్దరు జె.శేష చలపతి, కుందుర్తి గుర్వాచారిని బీసీ కమిషన్ మెంబర్లుగా నియమిస్తూ మంగళవారం సంక్షేమ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.అనంతరాము మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. బీసీ నాయకుడిగా తనకు గుర్తింపునిచ్చి...రాష్ట్ర అధ్యక్షుడిగా చేసిన జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు, వైసీపీ నేతలు సజ్జల రామకృష్ణారెడ్డి, వైవీ సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బీసీ కమిషన్ ఆశయాలకు అనుగుణంగా, బీసీల రిజర్వేషన్ల పరిరక్షణ కోసం, బీసీల హక్కులు, బీసీలకు విద్యా ఉద్యోగాల్లో లభిస్తున్న రిజర్వేషన్ల కోసం కమిషన్ పరిధిలో కృషి చేస్తానని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో 139 బీసీ కులాలు పాల్గొనాలని కోరారు. బీసీలకు రక్షణ కవచంగా ఆంధ్రప్రదేశ్ బీసీ కమిషన్ పనిచేస్తుందని స్పష్టం చేశారు.

బీజేపీ చేతిలో కీలుబొమ్మ జగన్ ప్రభుత్వం

ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శ

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం/విజయనగరం: వైఎస్సార్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ఏం అభివృద్ధి జరిగిందో వైవీ సుబ్బారెడ్డి చెప్పాలని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. సీఎం జగన్‌ని జగన్ రెడ్డి గారూ అని తాను పిలవడమే వాళ్లకి (వైసీపీ నేతలు) నచ్చలేదని షర్మిల చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి కోసం మాట్లాడాలని హితవు పలికారు. రాష్ట్రంలో ఒక్క ఎమ్మెల్యే ఎంపీ కూడా గెలవని బీజేపీ రాష్ట్రం మీద పెత్తనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలో పర్యటించారు. శ్రీకాకుళం జిల్లా పర్యటనలో భాగంగా ఆమె పలాస నుంచి పల్లె వెలుగు బస్సులో బెల్లుపడా మీదుగా ఇచ్ఛాపురం చేరుకున్నారు. ప్రయాణికులతో ముచ్చటించారు. వారి సమస్యలను అగిడి తెలుసుకున్నారు. వై.ఎస్.ఆర్ ప్రజా ప్రస్థానం విజయ వాటిక వద్దకు నడుచుకుంటూ వెళ్లి ఆమె తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డికి నివాళులర్పించారు. కాంగ్రెస్ ఏపీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్ ఠాగూర్, మాజీ మంత్రి జేడీ శీలం, పీసీసీ మాజీ అధ్యక్షులు రఘువీరా, గిడుగు రుద్రరాజు, సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు తదితర పార్టీ నాయకులు ఆమె వెంట ఉన్నారు. అనంతరం ఏఎస్.పేటలోని ఆర్జే ఫంక్షన్ హాల్‌లో డీసీసీ అధ్యక్షుడు పేడాడ పరమేశ్వర రావు అధ్యక్షతన పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. అలాగే విజయనగరంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు సరగడ రమేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో షర్మిల కార్యకర్తల నుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ తదితర పథకాలు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిర్వహించిన 'ప్రజా ప్రస్థానం' పాదయాత్ర నుంచి పుట్టినవేనని అన్నారు. వైఎస్ఆర్ పోరాటానికి కొనసాగింపుగా పేదల పక్షాన నిలబడేందుకే తాను వచ్చానన్నారు. వైఎస్సార్ జీవించినంత కాలం బీజేపీకి వ్యతిరేకమేనని... కానీ, ఇవాళ రాష్ట్రంలో పరిస్థితులు చూస్తుంటే బాధగా ఉందని షర్మిల అన్నారు. బీజేపీకి అధికార వైసీపీ, ప్రతిపక్ష టీడీపీ పార్టీలు తొత్తులుగా మారాయని, ఒక్క ఎమ్మెల్యే లేకపోయినా ప్రభుత్వం వాళ్ల చేతుల్లో ఉందన్నారు. జగన్ ప్రభుత్వం కీలుబొమ్మలా మారిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధి ఏమీ లేకపోగా బీజేపీకి వంత పాడటం దురదృష్టకరమని అన్నారు. 25 మంది ఎంపీలను ఇస్తే 'హెూదా' తెస్తానన్న జగన్ ఒక్క రోజు కూడా ప్రత్యేక హెూదా గురించి కేంద్రాన్ని ప్రశ్నించలేదని విమర్శించారు. వైసీపీ ఎంపీలు బీజేపీకి బానిసలయ్యారని విమర్శించారు. బీజేపీకి ఎందుకు అమ్ముడు పోవాల్సి వచ్చిందో వారు చెప్పాలన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయితే మొదటి సంతకం ప్రత్యేక హెూదా పైనే పెడతానని చెప్పారని, రాష్ట్రం గురించి ఆలోచించే కాంగ్రెస్ పార్టీ, వైఎస్ఆర్ ఆశయాలను అందరం బతికిద్దాం అని పార్టీ శ్రేణులకు పిలుపిచ్చారు. అన్ని వర్గాల ప్రజలను సమన్వయం చేసుకుంటూ పోవాలని, ఎవరు పార్టీలోకి వచ్చినా కూడా భేషజాలకు పోకుండా పార్టీలోకి చేర్చుకోవాలని హితవు పలికారు. ప్రతి కార్యకర్త రాష్ట్రానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించడమే ప్రధాన పనిగా పెట్టుకోవాలన్నారు. కార్యకర్తలు అంకితభావంతో పనిచేస్తే భవిష్యత్‌లో రాష్ట్రంలో అధికారం రావడం తథ్యమన్నారు. అందుకు తన శక్తి వంచన లేకుండా శ్రమిస్తానని, కార్యకర్తలందరూ సమైక్యంగా పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, ఆర్ఎంపీలు, వికలాంగుల నుంచి షర్మిల వినతిపత్రాలు స్వీకరించారు.

29న యువజన రాష్ట్ర సమ్మేళనం: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయవాడ: యువత ముందున్న సవాళ్లపై చర్చించేందుకు 'వాయిస్ ఆఫ్ యంగ్ ఇండియా' పేరుతో యువజన రాష్ట్ర సమ్మేళనం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి అధ్వర్యంలో జనవరి 29న విజయవాడలో నిర్వహించనున్నట్లు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్రబాబు, నక్కి లెనిన్‌బాబు వెల్లడించారు. స్థానిక దాసరి భవన్‌లో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశం సందర్భంగా రాజేంద్ర, లెనిన్ మాట్లాడుతూ భారతదేశంలోనే యువత ఎక్కువ ఉందని చెప్పారు. ప్రపంచంలో 186 కోట్లమంది యువజనులు ఉంటే అందులో 28 శాతం భారతీయులేనన్నారు. నవ యువకులతో నవనవలాడుతున్న యువజన దేశం భారత్ అన్నారు. ఏ దేశానికి లేనంత యువ సంపద మనకున్నప్పటికీ ఉత్తేజం, ఉత్సాహం కరువయ్యా యన్నారు. పాలకుల వినాశకర విద్యా విధానాల కారణంగా దేశంలోని 30 శాతం మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అకాశాలు లేవన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా లేదు... విభజన హామీలకు దిక్కులేదు. కడప ఉక్కు ఊసే లేదు. రామాయట్నం పోర్టు లేదు. రైల్వే జోన్ లేదు. మెట్రో రైలు లేదు. కనీసం వీటినైనా నిర్మించి ఉంటే వేలాది మందికి ఉపాధి లభించి ఉండేదన్నారు. ప్రభుత్వాలు అవలంబిస్తున్న వినాశకర ఆర్థిక విధానాల ఫలితంగా చదువుకు తగ్గ ఉద్యోగాలు రావడం లేదని విమర్శించారు. డిగ్రీలు, పీజీలు, పీహెచ్‌డీలు బీటెక్, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, లా కోర్సులు చదివినవారు కూడా చివరకు రైల్వే గ్యాంగ్‌మన్ ఉద్యోగాలకు, పోలీస్ కానిస్టేబుల్, హోంగార్డు ఉద్యోగాలకు పోటీపడాల్సి వస్తోందన్నారు. ఉద్యోగాలులేక, ఉపాధి అవకాశాలులేక వలస పోయే వారు కొందరైతే, మరికొంతమంది నిరాశా, నిస్పృహలతో కొకొయిన్, హెరాయిన్ వంటి మత్తుమందులకు బానిసలవు తున్నారన్నారు. అవినీతి, దోపిడీలకు ఆస్కారం లేని సమాజం యువత ఆకాంక్ష అని చెప్పారు. ఇది యువతతోనే సాధ్యమని, 2024 ఎన్నికల్లో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు. యువజన సమ్మేళనం పోస్టర్‌ను రాజేంద్రబాబు, లెనిన్‌బాబు ఆవిష్కరించారు.

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని ఏఐవైఎఫ్ నగర సమితి అధ్వర్యంలో దాసరి భవన్‌లో నిర్వహించారు. నేతాజీ చిత్ర పటానికి రాజేంద్రబాబు, లెనిన్‌బాబు పూల మాలు వేసి నివాళులర్పించారు. నేతాజీ పోరాట స్ఫూర్తిని వివరించారు. ఏఐవైఎఫ్ విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి లంకా గోవిందరాజులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుటూరి అరుణ్ కుమార్, సహాయ కార్యదర్శి లంకే సాయి, సింగంసెట్టి మోహన్ ప్రసాద్, గుంజ క్రాంతి కుమార్, రామకృష్ణ, ఐతం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలు

వినియోగంపై అధికారులకు శిక్షణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రేరేపిత రహిత ఎన్నికల పర్యవేక్షణను పెంపొందించేందుకు రూపొందించిన ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అమలుకు భారత ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల మధ్య అంతరాయం లేని సమన్వయం, గూఢచార భాగస్వామ్యాన్ని నిర్ధారించడం ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యం. ఆన్‌లైన్ ప్లాట్ ఫామ్ ద్వారా ఈ విధానం అమలు వల్ల ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు తీసుకునే చర్యలు, వాటికి సంబంధించిన వివరాలన్నీ ఎప్పటికప్పుడు ఆన్ లైన్‌లో నమోదు కావడమే కాకుండా ఎప్పటికప్పుడు సమాచారం అందుబాటులో ఉండటం వల్ల ఎటువంటి మానవ తప్పిదాలకు, అక్రమాలకు అవకాశం లేకుండా ఉండేందుకు ఆస్కారం ఏర్పడుతుంది. 2023 డిసెంబరులో చత్తీస్‌గఢ్, మధ్య ప్రదేశ్, మిజోరాం, రాజస్తాన్, తెలంగాణ రాష్ట్రాలకు జరిగిన సాధారణ ఎన్నికల్లో తొలిసారి ఈ వ్యవస్థను విజయవంతంగా వినియోగించారు. ఆ అనుభవంతో త్వరలో ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో కూడా ఈ విధానాన్ని అమలు పర్చేందుకు అవసరమైన శిక్షణను ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణా, తమిళనాడు, కేరళ, కర్నాటక రాష్ట్రాల అధికారులకు ఇచ్చేందుకు బెంగళూరుకు అధికార బృందాన్ని పంపింది. ఈ ప్రక్రియలో భాగంగా భారత ఎన్నికల సంఘం అధికార బృందం బెంగుళూరులో మంగళవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనాతో పాటు అనేక కేంద్ర, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి పాల్గొన్నారు. బెంగుళూరు, దిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం అధికారులు పాల్గొని ఈఎస్ఎంఎస్ వినియోగంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఆ వ్యవస్థ వినియోగంలో అనేక మంది అధికారులకు వచ్చిన సందేహాలను భారత ఎన్నికల సంఘం డైరెక్టర్ పంకజ్ శ్రీవాస్తవ్ నివృత్తి పర్చారు. ఈ శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వినియోగం వల్ల ఆటోమేటిక్‌గా డేటా జనరేట్ అవ్వడం, సేవ్ అవ్వడం వల్ల మానవ తప్పిదాలకు, డూప్లికేషన్‌కు అవకాశం ఉండదన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అడిషనల్ డీజీ (లా అండ్ ఆర్డర్) ఎస్.బాగ్చీ, ఐజీపీ పి.వెంకట రామి రెడ్డి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డైరెక్టర్ ఎం.రవిప్రకాష్, వాణిజ్య పన్నుల శాఖ స్పెషల్ కమిషనర్ అభిషిక్ కిశోర్, అదనపు సీఈవో పి.కోటేశ్వరరావు తదితరులతో పాటు ఎక్సైజ్, ఇన్‌కమ్ ట్యాక్స్, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో తదితర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు కాంగ్రెస్ తొలి దరఖాస్తు స్వీకరణ : మస్తాన్ వలీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల నుంచి పోటీ చేసే ఆశావాహుల నుంచి తొలి దరఖాస్తును స్వీకరించనున్నట్లు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వలీ చెప్పారు. విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మానిక్కం ఠాగూర్ బుధవారం విజయవాడకు వస్తున్నారని, ఈ సందర్భంగా దరఖాస్తు స్వీకరిస్తారని తెలిపారు. షర్మిల పర్యటనలతో అధికార వైసీపీలో ఆందోళన మొదలైందన్నారు. జగన్ ప్రభుత్వం షర్మిలకు భయపడుతోందని చెప్పారు. షర్మిల జిల్లాల పర్యటనకు మంచి ఆదరణ లభిస్తోందని, ఆమె మాటలు పేలుతున్నాయని ప్రశంసించారు. అభివృద్ధిపై షర్మిల చేసిన సవాల్‌ను జగన్ స్వీకరించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీకి పోటీ చేసే ఆశావాహులు సైతం ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎన్నికల షెడ్యూలు వచ్చేంత వరకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ విజయవాడ నగర అధ్యక్షులు నరహరిశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సిరిమానోత్సవానికి పోటెత్తిన భక్తజనం

విశాలాంధ్ర-మక్కువ/సాలూరు రూరల్/పార్వతీపురం: ఉత్తరాంధ్రుల ఇల వేల్పు, గిరిజనుల ఆరాధ్యదైవం, భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా గుర్తింపు పొందిన శంబర గ్రామదేవత శ్రీశ్రీశ్రీ పోలమాంబ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. పార్వతీపురం మన్యం జిల్లాలోని మక్కువ మండలం శంబర గ్రామంలో ఈ జాతర యేటా సంక్రాంతి పండుగ తరువాత జరగడం ఆనవాయితీ. సోమవారం తోడేళ్ల ఉత్సవం జరగగా...మంగళవారం సిరిమాను సంబరం అంబరాన్ని తాకేలా అమ్మవారికి జేజేలు పలుకుతూ భక్తులు నడిపించారు. సిరిమాను రథంపై పూజారి జన్నేటి భాస్కరరావు అధిష్ఠించిన తరువాత పూజలు నిర్వహించి సిరిమాను ఉత్సవాన్ని సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభించారు. ఆంధ్ర,ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి లక్షమందికిపైగా భక్తులు విచ్చేసి సిరిమాను సంబరాన్ని తిలకించారు. శ్రీశంబర పోలమాంబ అమ్మవారి జాతర పది మంగళవారాల పాటు జరుగుతుందని, మొదటివారం రాని భక్తులు మిగిలిన తొమ్మిది వారాలలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని ఆలయ కార్యనిర్వహణ అధికారి సూర్యనారాయణ తెలిపారు. మంగళవారం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున వస్త్రాలు, పసుపు కుంకుమలను ఉపముఖ్యమంత్రి పి.రాజన్నదొర సమర్పించారు. ఆయనకు దేవాదాయ ధర్మాదాయశాఖ అధికారులు ఘనస్వాగతం పలికారు. పార్వతీపురం మన్యంజిల్లా జాయింట్ కలెక్టర్ గోవిందరావు, ఆర్డీఓ కే.హేమలత, అదనపు ఎస్పీ డాక్టర్ దిలీప్ కిరణ్, పార్వతీపురం డీఎస్పీ సునీల్ షరోన్, దిశ డీఎస్పీ హర్షిత, ఏఆర్ డీఎస్పీ శేషాద్రి, ఎస్సీ, ఎస్టీ డీఎస్పీ మురళీధర్, పాలకొండ డీఎస్పీ కృష్ణారావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టరు జగన్నాథరావు, జెడ్పీటీసీ మావుడి శ్రీనివాసరావు, వైసీపీ అధ్యక్షుడు మావుడి గంగునాయుడు, సాలూరు సీఐ ధనుంజయరావు, పార్వతీపురం సీఐ రవికుమార్, మక్కువ ఎస్ఐ నర్సింహమూర్తి, ఎంపీటీసీ తీళ్ల పోలినాయుడు, మక్కువ ఎంపీపీ మర్రి పారమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ఆవాల సూర్యనారాయణ, ఈఓపీఆర్డీ దేవ కుమార్, ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్, జిల్లా రవాణాశాఖ అధికారి మల్లికార్జునరెడ్డి, శంబర ఈఓ వీవీ సూర్యనారాయణ తదితరులు అమ్మవారిని దర్శించుకొని జాతర ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, దేవాదాయ ధర్మాదాయ, విద్యుత్, గ్రామీణ నీటి సరఫరా విభాగం తదితరశాఖల అధికారులు సమన్వయంతో జాతర ప్రశాంతంగా ముగిసింది.

సంపాదకీయం

మోదీ విశ్వరూపం

సోమవారం అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠా కార్యక్రమాన్ని టీవీలో కళ్లు కాయలు కాసేట్టు చూసిన వారికి అసలు కార్యక్రమం కన్నా ఎక్కువగా మోదీ విశ్వరూపమే కనిపించింది. అన్ని కెమెరాలూ మోదీ మీదకే మళ్లించినట్టున్నారు. డిజిటల్ కెమెరాలు మన దేశంలోకి రాక ముందే తాను డిజిటల్ కెమెరా వాడానని చెప్పుకునే మోదీకి తన ఫొటోలంటే ఎంత ఇష్టమో చెప్పలేం. ఆయన రాముడికి సమర్పించదలచిన సామాగ్రి ఉన్న పళ్లెం పట్టుకుని రామాలయంలో నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యం చూస్తే ఆ ఆలయం అంత నిర్మానుష్యంగా ఎందుకు ఉందో అసలే అర్థం కాదు. ఆయన ఒక్కడే గంభీరంగా నడుచుకుంటూ వెళ్లిన చిత్రాలు, వీడియోలే టీవీ తెరల నిండా పరచుకున్నాయి. ఆలయాన్ని ప్రారంభించడానికి, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించే అధికారం మోదీకి లేదని నలుగురు శంకరాచార్యులతో సహా అనేకమంది సంతులు, సాధువులు గగ్గోలు పెట్టిన తరవాత ఈ క్రతువుకు మోదీ ప్రధాన యజమానిగా ఉండరన్న వార్తలు వచ్చాయి. అంటే మోదీ ఒక అడుగు వెనక్కు వేసినట్టు అనిపించింది. అనిల్ మిశ్రా దంపతులు ఈ క్రతువు నిర్వర్తిస్తారని అన్నారు. తీరా ప్రతిష్ఠాపన తీరుచూస్తే అనిల్ మిశ్రా అడ్రసే కనిపించలేదు. ప్రతిష్ఠాపన ఒక్క రోజులో పూర్తి అయ్యే వ్యవహారం కాదు. అంతకు ముందు చాలా కార్యక్రమం ఉంటుంది. అందులో అనిల్ మిశ్రా పాత్ర ఏమన్నా ఉందేమో తెలియదు. సోమవారం మాత్రం మోదీయే యజమానిగా వ్యవహరించారు. మోదీతో పాటు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ మాత్రమే గర్భ గుడిలోకి వెళ్లిన ప్రముఖులు. అక్కడ కూడా యోగీ ఆదిత్య నాథ్ మీదకు కెమెరా మళ్లిన సందర్భాలు చాలా తక్కువ. శక్తిమంతుడైన యోగీ పరిస్థితే అలా ఉంటే గవర్నర్ ఆనందిబెన్ పటేల్ మీదకు వీడియోలు ఎందుకు తిప్పుతారు. ఈ పరిస్థితిని గమనించే కాబోలు ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భగవత్ కుడివేపు వచ్చి నిలబడ్డారు. అసలు ఆయన ఏ హోదాలో ఆ ప్రతిష్ఠాపనా కార్యక్రమలో పాల్గొన్నారో తెలియదు. ఏమైతేనేం చాలా "పవిత్రమైంది", "ప్రధానమైంది" అనుకున్న ఈ కార్యక్రమంలో సర్వత్రా మోదీ విశ్వరూపమే కనిపించింది. ఆగమ శాస్త్రాన్ని పట్టించుకున్నట్టే లేదు. రామానంద సంప్రదాయం ప్రకారమే ప్రతిష్ఠాపన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మరి నాథ్ సంప్రదాయానికి చెందిన, వైష్ణవుడు కాని యోగీ ఆదిత్య నాథ్ గర్భ గుడిలోకి ఎలా వెళ్లగలిగారో! బహుశ: ముఖ్యమంత్రి హోదా కారణం అయి ఉండొచ్చు. ఇది ఆలయ నిర్మాణం, ప్రతిష్ఠాపనకు సంబంధించి ఏ నియమం ప్రకారం జరిగిందో తెలియదు. అంతా ప్రభుత్వ కార్యక్రమం లాగే సాగింది. మోదీ కేంద్రకంగానే మొత్తం వ్యవహారం అంతా సాగిపోయింది. రామమందిర ఉద్యమంలో పాల్గొన్న వారి, బాబ్రీ విధ్వంసంలో కీలక పాత్ర పోషించిన వారి ఊసే వినిపించలేదు. బాబ్రీ మసీదు విధ్వంసం సమయంలో పలుగు పారా, సుత్తి లాంటి ఉపకరణాలు పట్టుకుని ఆ మసీదు రాయి రాయి విడగొడ్తున్న వాళ్లను "ఏక ధక్కా ఔర్ దో" (మరో తోపు తోయండి) అని "ఉత్సాహ" పరిచిన సాధ్వి రితంభర, ఉమా భారతి వంటి వారు మీడియా కెమెరాకు చిక్కిన దాఖలాలు లేవు. ఆ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వినయ్ కత్యార్, ప్రవీణ్ తొగాడియా లాంటి వారు ఏమయ్యారో తెలియదు. అసలు విశ్వ హిందూ పరిషత్తు నేతల హడావుడి ప్రతిష్ఠాపన సమయంలో కనిపించనే లేదు. బీజేపీ అధ్యక్షుడు నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ ముఖారవిందాలు ఉదాహరణ ప్రాయంగా కూడా కార్యక్రమం పొడవునా కనిపించనే లేదు.

ప్రతిష్ఠాపనా కార్యక్రమం ముగిసిన తరవాత మోదీ ఆహ్వానితులు కూర్చున్న చోట కలియ తిరిగి అమితాబ్ బచ్చన్ లాంటి సినీ నటుల్ని, బడా వ్యాపారవేత్తలు అంబానీలను పలకరించిన దృశ్యాలు మాత్రం కనిపించాయి. ఈ కార్యక్రమం అంతా ప్రభుత్వ కార్యక్రమం లాగే సాగింది. పత్రికలలో విపరీతంగా వ్యాపార ప్రకటనలు ప్రత్యక్షమయ్యాయి. దీనికి అయిన ఖర్చు అంతా ప్రభుత్వమే భరించి ఉంటుందిగా! కొన్ని వేల కోట్లు ఖర్చయి ఉంటుంది. ఇంత ప్రజాధనం ఏ ఖాతా కింద వెచ్చించినట్టో! రామ మందిర ఉద్యమ ప్రధాన కారకుడు లాల్‌కృష్ణ అద్వానీ జాడే లేదు. ఆయనకు, మురళీమనోహర్ జోషీకి ఆహ్వానాలైతే అందాయి కాని మీరు రానక్కర్లేదని మొహం మీదే చెప్పేశారు. రాష్ట్రపతి ముర్మును మొదట ఆహ్వానించనే లేదు. విమర్శలు తట్టుకోలేక ఆమెకు ఆహ్వానం పంపించి ఓ పనైపోయిందనిపించారు. వెండితెర వేల్పులను మాత్రం గుర్తు పెట్టుకుని పేరు పేరునా ఆహ్వానించారు. వీరిలో కొందరు మందిర నిర్మాణానికి భారీగా విరాళాలిచ్చారంటున్నారు. ఆలయం పూర్తి కాకుండా సంప్రోక్షణ ఏమిటన్న మత పెద్దల విమర్శలను పట్టించుకున్న నాథుడే లేడు. మోదీ అధ్వర్యం వహిస్తే మోహన్ భగవత్ సకల కార్యాలు చక్కబెట్టారు. ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేయడం అంటే ఇదేగా! కొందరిని ఆహ్వానించకుండా ఎందుకు మినహాయించారు అన్న ప్రశ్నకు మోహన్ భగవత్ దగ్గర సమాధానం సిద్ధంగా ఉంది. రామమందిర నిర్మాణ ట్రస్ట్ ఆహ్వానాలు పంపిందని ఆయన వాటంగా తప్పించుకున్నారు. కాని దర్శకత్వం పూర్తిగా ఆయనదే. నాయకత్వం మాత్రం మోదీది. ఈ వ్యవహారం అంతా ట్రస్టే నిర్వహించి ఉంటే మోదీని ఈ క్రతువుకు యజమానిని చేసి ఉండకూడదు. అంటే ఈ కథంతా ఆర్ఎస్ఎస్, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం జమిలిగా నిర్వహించాయన్నదే వాస్తవం. తాను ఈ కార్యక్రమం నిర్వహించడం దైవ నిర్ణయం అని మోదీ అనేక సార్లు చెప్పుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ఆచార్య గోవింద్ దేవ్ గిరి అయితే మోదీ రూపంలో శివాజీ మళ్లీ పుట్టినట్టుగా ఉంది అన్నారు. ఆలయ నిర్మాణ ట్రస్టు బాధ్యత ఉన్న చంపత్ రాయ్ అయితే మోదీ శ్రీ మహావిష్ణువు అవతారం అన్నారు. చాలా మంది మత పెద్దలు స్వచ్ఛందంగా మోదీ ముందు సంపూర్ణంగా లొంగి పోయారు. అలా లొంగని వారు విమర్శలు ఎదుర్కోవలసి వచ్చింది. వారంతా ఈ తంతుకు దూరంగానే ఉండిపోయారు. శ్రీ రాముడికి మళ్లీ ఆవసం ఏర్పడింది అని చెప్పిన మోదీ, భగవత్ ఎంత సాహసం ప్రదర్శించారో! ప్రతిష్ఠాపన దేశమంతటినీ సమైక్యం చేసింది అన్న నోటితోనే మరో సందర్భంలో అయితే అగ్గి అంటుకునేది కానీ ఇప్పుడు ఈ ప్రారంభం మహాశక్తి అని మోదీ చెప్పేవారే కాదు. 11 రోజుల అనుష్ఠానం మోదీ ధోరణిని ఏమాత్రం మార్చలేకపోయింది. బాబరీ వివాదం లేవనెత్తడం ద్వారా రాజకీయంగా అపారమైన లబ్ధి పొందిన బీజేపీ మందిర ఆవిష్కరణతో 2024 సార్వత్రిక ఎన్నికలలో మరోసారి అధికారం అందిపుచ్చుకోవాలని ఆశిస్తోంది. దీన్ని మించిన ఆయుధం బీజేపీ అమ్ముల పొదిలో ఏమీ మిగలనట్టే.

నాణ్యమైన చదువులు నవ ప్రపంచానికి వెలుగులు

ప్రపంచంలో చోటు చేసుకుంటున్న అస్తవ్యస్థ పరిణామాలను, అసమానతలను తొలగించి, శాంతి నెలకొల్పడం, ఆర్థికాభివృద్ధి సాధించి, సుస్థిర శాంతియుత ప్రపంచాన్ని నిర్మించడమే అంతర్జాతీయ విద్యా దినోత్సవ ముఖ్య లక్ష్యం. అన్ని అవలక్షణాలకు విరుగుడు "విద్య" అనే ఆయుధం. అలాంటి ఆయుధంతో అజ్ఞానాన్ని పారద్రోలాలి. సంస్కారవంతమైన చదువులకు శ్రీకారం చుట్టాలి. దానివలన సమాజంలో విలువలు వికసిస్తాయి. చదువుల్లో నాణ్యత పెరిగితే ఉపాధి అవకాశాలు లభిస్తాయి. విద్యారంగం అన్ని రంగాలకు తలమానికం. విద్యారంగం సక్రమంగా ఉంటేనే మిగిలిన రంగాలు బాగుంటాయి. దేశ ప్రగతి సాధ్యపడుతుంది. విద్య వ్యాపారంగా మారిన నేపథ్యంలో విద్యారంగాన్ని సమూల ప్రక్షాళన చేయాలి. విజ్ఞానంతో పాటు వివేకాన్ని రంగరించి చదువులు నేర్పాలి. ఉపాధ్యాయులు విద్యావ్యవస్థకు వెన్నెముక లాంటి వారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంలో ప్రభుత్వాలు, ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఉపాధ్యాయ వృత్తి అత్యంత కీలకమైనది. అలాంటి ఉపాధ్యాయ వృత్తిని అంకిత భావంతో నిర్వర్తించాలి. జ్ఞానం మనిషికి అమూల్యమైన ఆభరణం. జ్ఞానమనే వృక్షానికి సంస్కారమనే చిగురు తొడిగితే, వినయమనే కొమ్మలు విస్తరించి, వివేకమనే పూలు పూస్తే, వాటి ఫలాలు కూడా అత్యంత మధురంగా ఉంటాయి. జ్ఞానానికి ఆధారం విద్య. విద్యకు వెలుగు క్రమశిక్షణ. సత్ప్రవర్తన, తపన, లక్ష్యం, చిత్తశుద్ధి, సంకల్పబలం అనే గుణాలు జ్ఞానసముపార్జనకు మూలాధారం. "విద్య" మానసిక పరివర్తనకు, మానసిక వికాసానికి మార్గం చూపాలి. మానసిక ఎదుగుదల వ్యక్తిత్వానికి దారి తీస్తుంది. నిర్మాణాత్మకమైన ఆలోచనల వలన బాధ్యతాయుతమైన ప్రవర్తన అలవడుతుంది. సమాజం పట్ల అవగాహన పెరుగుతుంది. దేశభక్తి ఏర్పడుతుంది. పెద్దల పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శించడం, ఇతరుల మనోభావాలను గౌరవించడం, నిజమైన ప్రతిభకు గుర్తింపునివ్వడం, ఆత్మాభిమానంతో జీవించడం వంటి లక్షణాలను పెంపొందించడమే నిజమైన వ్యక్తిత్వ వికాసం. అలాంటి వ్యక్తిత్వ వికాసం విద్య వలన సమకూరాలి. పూర్వకాలంలో ఇలాంటి విద్య లభించేది. పూర్వ కాలపు విద్య విలువల ఆధారంగా కొనసాగింది. నాటి సమాజంలో ప్రజలంతా సక్రమ పద్ధతిలో న్యాయం, ధర్మం అనే విలువలతో జీవించేవారు. కాలక్రమంలో ఎన్నో మార్పులు సంభవించాయి. విద్యా విధానంలో అనేక మార్పులు సంతరించుకున్నాయి. విద్య కేవలం ఉపాధికి మాత్రమే పనికొచ్చే ముడి సరుకుగా మారింది. ధనార్జన మాత్రమే ధ్యేయంగా అనేక విద్యాలయాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఏదో రకంగా చదివేసి, బట్టీ పట్టేసి పట్టా సాధించి చిన్నాచితక ఉద్యోగం సంపాదించేసి, అదే జీవిత పరమార్థంగా భావించడం విచారకరం. స్వదేశంలో జీతాలు చాలక విదేశాలకు పయనమై, అక్కడే ఉన్నత విద్య పేరుతో పట్టాలు సాధించి, డాలర్ల కోసం పడరాని పాట్లు పడుతున్న వారిని చూస్తున్నాం. మన దేశంలోనే ఉద్యోగ అవకాశాలు మెరుగు పడాలి. కష్టానికి తగిన వేతనం లభించాలి. ఇతర అభివృద్ధి చెందిన దేశాల్లోని విద్యా విధానం లోని నాణ్యతా ప్రమాణాలను మన విద్యారంగంలో నెలకొల్పాలి. చదివిన చదువుకు, చేస్తున్న ఉద్యోగాలకు పొంతన లేని పరిస్థితులను నివారించాలి. కష్టపడి చదివిన వారికి, కాపీలు కొట్టి డిగ్రీలు సంపాదించిన వారికి వ్యత్యాసం లేకుండా పోతున్న రోజులివి. కళాశాలలకు వెళ్లకుండానే డిగ్రీలు సాధిస్తున్న రోజులివి. ప్రతిభకు, సమర్థతకు విలువ లేని ఒక విచిత్రమైన పరిస్థితుల్లో విద్యా విధానం కూనారిల్లుతున్నది. నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు చేస్తున్న వారిని నిలువరించకపోతే ప్రమాదకరం. ప్రతిభ లేకుండానే ఒకటి రెండు నెలలు కంప్యూటర్ కోర్సులు నేర్చుకుని, నేర్చుకోకపోయినా, సర్టిఫికెట్ల సంపాదించి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరుతో అరకొర జీతాలతో జీవితాలను నెట్టుకొస్తున్న వారి జీవితాలను స్పృశించాలి. ప్రతిభ ఉన్నా, లేకపోయినా అందరిదీ ఒకటేదారి. ప్రతిభ గల వారిని కుల,మతాలకతీతంగా ప్రోత్సహించాలి. ప్రతిభకు పట్టాభిషేకం జరగాలి. పదవ తరగతి నుంచి ప్రతిభను ప్రామాణికంగా తీసుకోవాలి. సత్ప్రవర్తనను కూడా ఉద్యోగాలకు అర్హతగా భావించాలి. విద్యార్థి నడవడికను అంచనా వేయాలి. చదువుతో పాటు పదవ తరగతి నుంచి తర్వాత స్థాయిల్లో ప్రతిభతో పాటు ప్రవర్తన ఆధారంగా కూడా ఉద్యోగ నియామకాలు జరగాలి. ఇలా జరిగినప్పుడే చిన్నతనం నుంచి వినయం, వివేకం, సంస్కారం వంటి గుణాలు అలవడతాయి.

సుంకవల్లి సత్తిరాజు (సామాజిక విశ్లేషకులు)
సెల్ :9704903463.

హిందువుల్లో విభేదాలు

రామాలయంలో 2024 జనవరి 22న అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ రాజకీయ పలుకుబడి పెరిగినప్పటికీ లోకసభ ఎన్నికల్లో గెలుపు సందేహమే. బాలరాముడి ప్రాణప్రతిష్ఠ తర్వాత ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ, బీజేపీ వివాదాస్పద మథుర, కాశీ అంశాలను లేవనెత్తడంవల్ల లోకసభ ఎన్నికల్లో గెలుపు సందేహమే. అలాగే హిందువులలో ఐక్యతలేదని రామాలయం ప్రారంభ కార్యక్రమ నిర్వాహకులు గ్రహించారు. రాజకీయాల కోసమే అయోధ్యలో కార్యక్రమం నిర్వహించారని అనేకమంది హిందువులు గ్రహించారు. రాజకీయాల కోసమే ఈ కార్యక్రమం నిర్వహించారని అనేకమంది హిందువులు అసలు హాజరుకాలేదు. కొంతమంది హిందువులు తమ నాయకుడు మోదీతో సహా మూడవసారి తమదే గెలుపు అని ముందుగానే నిర్ణయించుకున్నారు. రామాలయం నిర్మించి ప్రారంభించినందున మోదీ పట్ల చాలా సంతోషంగా ఉన్నారని అందువల్ల తప్పక గెలుస్తారని అనుకుంటున్నారు. అయితే క్షేత్రస్థాయి వాస్తవాలు వేరుగా ఉన్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత బీజేపీ బలం తగ్గుతూ వస్తున్నది.

2019 లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచినప్పటికీ ఆ తర్వాత రాష్ట్రాల్లో ఒకదాని తర్వాత మరొక ఎన్నికల్లో బీజేపీ ఓట్ల శాతం తగ్గుతూ వస్తోంది. అసోంలో 2.84శాతం, హరియాణాలో 21.53శాతం ఓట్లు పెరిగి అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందింది. అయితే గత 9నెలల నుంచి మణిపూర్‌లో మంటలు రేగుతున్నందున రాష్ట్రంలో బీజేపీపై అనేక గ్రూపులు గణనీయంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈశాన్య ప్రాంతంలో బీజేపీ, ప్రత్యేకించి చాలా గ్రూపులు వ్యతిరేకంగా ఉన్నాయి. పైగా అంతర్యుద్ధం లాంటి పరిస్థితిని చక్కబరచడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ప్రధానమంత్రి మోదీ అత్యవసరంగా రామాలయం ప్రారంభోత్సవం నిర్వహించడానికి బలమైన కారణం ఉంది. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఓట్లు తగ్గిపోతున్నాయి. దీంతో 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి వెనుకబాటు పడుతుందని, హిందువులు ఇతరకులాల మధ్య విభేదాలను సృష్టించడానికి ప్రయత్నిస్తే సవాలు ఎదురవుతుందని భావిస్తున్నారు. ఇండియా కూటమి పార్టీలు, ఇతర ప్రాంతీయపార్టీలు కలిసి బీజేపీ రాజకీయ, మతోన్మాద వ్యవహారాలను ప్రచారం చేస్తాయని మోదీ భావించి అయోధ్యలో అట్టహాసంగా బాలరాముడి ప్రాణప్రతిష్ఠ చేశారు. సెక్యులరిజం ప్రశాంతతను, తగినన్ని ఉద్యోగాలను సృష్టించ గలదని, ఆదాయం పెంచగలదని కూడా బీజేపీ ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో ఇండియా కూటమి పూర్తిస్థాయిలో సీట్లు పంపిణీ, ప్రచారం ద్వారా తగిన జవాబు ఇవ్వాలి. రెండువైపులా పదునున్న కత్తి విఫలమైన అంశాన్ని కూడా గ్రహించి రామాలయం ప్రారంభించి తనపై గల వ్యతిరేకతను తగ్గించుకోవాలని అయోధ్యలో ఉత్సవాన్ని నిర్వహించింది. అయితే ప్రతిపక్షం నూతన పంథాను అనుసరించింది. టీఎంసీ నేత మమతా బెనర్జీ కాళిమాతను పూజించి, విశ్వాస ర్యాలీ నిర్వహించారు. దిల్లీలో ఆప్ శ్రేణులు మత ఉత్సవాలు జరిపాయి. మహారాష్ట్రలో శివసేన పూజలు నిర్వహించింది. అలాగే దేశవ్యాప్తంగా ఇతర పార్టీల హిందువులు వేరుగా పూజా కార్యక్రమాలు నిర్వహించాయి. బీజేపీకి మద్దతునిచ్చే ఒడిశాలో బీజేడీ జగన్నాథస్వామి ఉత్సవాలు జరిపింది. చాలా చోట్ల కాంగ్రెస్ నాయకులు నిర్వహించిన ఉత్సవాలలో బీజేపీకి చెందని హిందువులు పాల్గొన్నారు. మోదీ అయోధ్యలో నిర్వహించిన ఉత్సవాల మూలంగా పూర్తిగా బీజేపీకి అనుకూలంగా మారలేదు. బీజేపీ చేస్తున్న రామరాజ్యం ప్రచారాన్ని ఇండియా పార్టీలు తమ సొంత కార్యక్రమాలు నిర్వహించి తిప్పికొట్టాలి. రాహుల్ గాంధీ నిర్వహిస్తున్న భారత్ జోడో న్యాయ యాత్ర అసోం బీజేపీ శ్రేణులలోను అలాగే ముఖ్యమంత్రి హిమంత్‌బిశ్వాస్ శర్మలోను ఆందోళన కలిగించింది. రాహుల్ యాత్రపైన కర్రలు, ఇతర వస్తువులతో దుండగులుదాడికి పాల్పడ్డారు. రాహుల్ యాత్రపై దాడులు ఎందుకు సాగించారు? రాహుల్‌పై ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేశారు? కొన్ని ఆలయాలను దర్శించాలని రాహుల్ గాంధీ తలపెట్టినప్పటికీ రాష్ట్రప్రభుత్వం అనుమతించలేదు. రాహుల్ యాత్ర ప్రశాంతంగా నిర్వహించకుండా బీజేపీ, అసోం రాష్ట్ర ప్రభుత్వం అలజడి రేపకుండా ఉండిఉంటే రాహుల్‌యాత్రను పెద్దగా గుర్తించేవారు కాదేమో! ప్రతిపక్షపార్టీల ఇండియా కూటమి దేశ వ్యాప్తంగా ప్రచారకార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల మద్దతును పొందేందుకు సమయం వృథా చేయడానికి అవకాశం లేదు. పార్టీల మధ్య స్వల్ప విభేదాలు ఉన్నప్పటికీ సీట్ల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తిచేసి దేశవ్యాప్తంగా తమ కూటమి గెలుపొందవలసిన అవసరాన్ని ప్రజలకు వివరించాలి. బీజేపీ ఓట్లు ఇప్పటికే తరిగిపోతూ ప్రతిపక్షాల ఓట్లు పెరుగుతున్న విషయాన్ని గుర్తించాలి. రానున్న లోకసభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి ప్రతిపక్ష కూటమి అభ్యర్థిని గెలిపించేందుకు ముమ్మరప్రచారం నిర్వహించాలి. బీజేపీకి తరుగుతున్న ఓట్లను నరేంద్రమోదీ మళ్లీ పెంచుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నిస్తున్నారు. మతాల మధ్య చిచ్చురేపేందుకు కూడా వెనకాడబోరు. అందువల్ల ఇండియా కూటమి ఎంతమాత్రం ఆలస్యం చేయకుండా ప్రచార రంగంలో ముందుకు దూసుకువెళ్లాలి. ఐపీఏ

ఆర్థికాభివృద్ధిలో ఎగుమతులే కీలకం

దేశ ఆర్థిక అభివృద్ధిలో ఎగుమతులు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఒక దేశం ఎగుమతుల ద్వారా సముపార్జించే ఆదాయం ఆ దేశ దిగుమతుల కన్నా ఎక్కువ మేర ఉన్నప్పుడు విదేశీ మారకపు నిల్వల్లో వృద్ధి నమోదవుతుంది. కొంతకాలంగా కోవిడ్ మహమ్మారి సంక్షోభం, అంతర్జాతీయ పరిణామాలు, వివిధ దేశాల మధ్య యుద్ధ వాతావరణం విదేశీ వాణిజ్యానికి ఆటంకాలుగా మారాయి. అంతేకాక ద్రవ్యోల్బణం అదుపుతప్పి నిత్యావసర వస్తువులు ధరలు చుక్కలను తాకుతున్నాయి. అంతర్జాతీయంగా ఏర్పడిన సంక్షోభాలను అధిగమించి 2023 ప్రారంభం నుంచి ఎగుమతులు పెరగడం శుభ పరిణామంగా పేర్కొనవచ్చు. పరిస్థితులు పూర్తిగా సానుకూలించడంతో మళ్లీ పూర్తి సాధారణ స్థితికి వస్తోందని కేంద్ర వాణిజ్య శాఖ కూడా ఆశాభావం వ్యక్తం చేయడం గమనార్హం. కొన్ని దేశాల మధ్య ఏర్పడిన యుద్ధ వాతావరణన్ని అధిగమించే దిశగా భారత్ తన అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగానే ఇటీవల ఆస్ట్రేలియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లతో కుదుర్చుకున్న ఒప్పందాల కారణంగా ఎగుమతులు బాగా పెరిగే అవకాశం ఏర్పడింది. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం కూడా ఎగుమతిదారులకు ఇంకా విధానపరమైన సహకారం కూడా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఏ దేశమైనా ఆర్థిక అభివృద్ధి సాధించాలంటే పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం, మౌలిక వసతులకు తోడు వాటిని సమర్థంగా వినియోగించగల మానవ శక్తి ఉండాలి. వాటిని ప్రోత్సహిస్తేనే ఎగుమతులు ముందంజలో ఉంటాయి. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) సానుకూల వ్యాపార వాతావరణానికి కృషి చేయడం, కార్మిక నిబంధనల క్రమబద్ధీకరణ, ఎలక్ట్రానిక్స్ తదితర పారిశ్రామిక ఉత్పత్తులు పుంజుకోవడం వల్ల ఈ ఏడాది ఎగుమతులు బాగా పెరుగుతాయి అన్నది ఇటీవల ప్రకటించిన విదేశీ వాణిజ్య విధానం అంచనా. అంతేకాక రవాణా వ్యయాలు దిగివస్తేనే ఎగుమతులు ఊపందుకుంటాయి.

2030 నాటికి రెండు లక్షల కోట్ల డాలర్లను సాధించాలనే లక్ష్యంతో కేంద్రం ఈ విదేశీ వాణిజ్య విధానం- 2023 ను రూపొందించింది. దీనితో పాటు 14 రంగాల కోసం ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం (పీఎల్ఐ) దేశీయ ఎగుమతులను రానున్న రోజుల్లో మరింత ఇనుమడింప చేస్తుంది. ఇప్పటికే ఈ పథకం ఎలక్ట్రానిక్స్ రంగంలో అనూహ్య ప్రగతికి దోహదపడింది. భారత్ బలమైన ఎగుమతి దేశంగా అవతరించాలంటే మరిన్ని నూతన విధానాలను రూపొందించుకోవాలి. 2022 ఏప్రిల్ - నవంబర్ మధ్య 29,821 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులు జరిగాయి. వాటితో పోలిస్తే క్రితం ఏడాది అదే కాలంలో ఎగుమతులు 6.3శాతం (27,879 కోట్ల డాలర్లు) తక్కువగా నమోదయ్యాయి. దీనికి ప్రధాన కారణం, పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు దెబ్బ తినడమే చైనా ఆర్థిక వ్యవస్థ గత కొంతకాలంగా దిగజారుతుండటం ప్రపంచ వాణిజ్యానికి శరాఘాతంగా మారింది. భారత్ సహా అనేక దేశాల పరిశ్రమలకు అవసరమైన ముడిసరుకు, విడిభాగాలు ఎక్కువగా చైనా నుంచే వస్తాయి. దీంతో తయారీ రంగాలు చిక్కుల్లో పడ్డాయి. ఉత్పత్తి కార్యకలాపాలు దెబ్బతిన్నాయి. అన్ని దేశాలు ఆర్థికంగా బాగుండాలంటే చైనా కోలుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అనేక దేశాల ఆర్థిక వ్యవస్థల్లో ప్రతికూల పరిస్థితులు నెలకొన్నప్పటికీ భారత్ ఎగుమతుల్లో ముందడుగు వేయడం కీలక పరిణామమే. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించాలి. సరళీకృత ఆర్థిక విధానాలతో ముందడుగు వేసి ప్రపంచంలోనే భారత్ అధిక ఎగుమతులు చేసే దేశంగా గుర్తింపు పొందేలా చర్యలు తీసుకుంటే మంచిది.

గోపాలుని రాధాకృష్ణ, ఫోన్: 9885390232

'విస్తరిస్తున్న ఆహార భద్రతా సమస్య'

బి.లలితానంద ప్రసాద్(రిటైర్డ్ ప్రొఫెసర్)

పర్యావరణం ప్రమాణాల పతనం ఇప్పటికే ప్రపంచ వ్యవసాయంపై ప్రభావం చూపిస్తున్నది. మన దేశంపై ఇది మరింత ఎక్కువ. ప్రభుత్వ విధానాలు, నియంత్రణలు దీనికి కారణం. ఇటు దేశీయంగా, అటు అంతర్జాతీయంగానూ ఆహార అవసరాలరీత్యా దీనిపై దృష్టి పెట్టడం అవసరం. ఇందుకు మన దేశం పెద్ద ఆహార పదార్థాల ఎగుమతిదారు కావడం కూడా కారణం. కానీ ఇక్కడ రాజకీయాలు వీటికి ప్రతిబంధకంగా తయారయ్యాయి. డిసెంబరు నెలారంభంలో దేశీయంగా ధరల నియంత్రణ నిమిత్తం భారత్ ఉల్లిపాయల ఎగుమతిపై మార్చి వరకు నిషేధం విధించింది. ఇవి అంతకుముందు 18 నెలల నుంచి అమలులో ఉన్న బియ్యం, గోధుమలు, చక్కెరపై నిషేధాలకు అదనం. మన దేశం ప్రపంచంలో అతి పెద్ద బియ్యం ఎగుమతిదారు. చక్కెర, ఉల్లిపాయల ఎగుమతుల్లో రెండో స్థానంలో ఉంది. పైగా అతి పెద్ద గోధుమ ఉత్పత్తిదారు. వీటన్నింటిపై ఆంక్షలతో ప్రపంచం అంతా గగ్గోలు పెడుతోంది. వీటి పర్యవసానంగా అనేక దేశాల్లో ఆహార పదార్థాల ధరలు విపరీతంగా పెరిగాయి. థాయిలాండ్‌లో బియ్యం ధరలు 14శాతం, వియత్నాంలో 22శాతం జులై నుంచి అక్టోబర్ మధ్యలో పెరిగాయి. ఇవి ఇంటర్నేషనల్ ఫుడ్ పాలసీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ గణాంకాలు. జులై నుంచి మన ఎగుమతి ఆంక్షలు అనంతరం మలేసియా, ఫిలిప్పైన్స్ ఈ ధరల పెరుగుదలను వారి సొంత ప్రమాణాల్లో గణించటం ప్రారంభించాయి. మన దేశంలో అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు అపారంగా పెరిగాయి.

వాతావరణ మార్పులు తప్పనిసరిగా మన దేశంలో ఆహార పదార్థాల ఉత్పత్తి, ధరల అందుబాటుపై అధికంగా ప్రభావం చూపుతాయి. మన కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖ ఇటీవల అంచనాల ప్రకారం సరైన పద్ధతులు అనుసరించ నందున వర్షాధార వరి ఉత్పాదన 2050 నాటికి 20శాతం తగ్గిపోతుందని అంటున్నారు. వీటికి ప్రభుత్వ దేశీయ విధానాలు 'అగ్నికి ఆజ్యం పోసినట్లు ఉండటం' దారుణం. ప్రస్తుతం

ప్రభుత్వం దాదాపు రెండు డజన్ల వ్యవసాయ ఉత్పత్తులకు కనీస ధర నిర్ధారించింది. సేకరణకు గ్యారెంటీలను ఇచ్చింది. కొన్నింటికి రైతులకు ఎరువులు, విద్యుత్, రవాణాలో సబ్సిడీల రూపంలో రాయితీలు ఇస్తుంది. ఇవి రాయటానికి, చెప్పడానికి, చెప్పుకోవడానికి బాగుంటాయి. ఆచరణలో ముప్పిరిగొన్న లొసుగులు అసలు సమస్య. ఇవి ఆహార భద్రతకు సానుకూలంగా ఉన్నట్లు ఉంటాయి. కానీ ఇవి పెట్టుబడులకు, ఆహార పంపిణీలకు అడ్డంకిగా కొందరు పరిగణిస్తున్నారు. మన ప్రభుత్వం సొంత పరిశీలన ధరవరల విషయం తెలిస్తే ఆశ్చర్యం కలుగుతుంది. మనం ఎటు పోతున్నామో! ఏమై పోతున్నామో! తెలియకుంది. వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ కమిటీల చట్టాలు, వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం నిర్దేశించేది, నియంత్రించేది కొనుగోలు దారులను, కమిషన్ ఏజెంట్లను, ప్రైవేట్ మార్కెట్లను. వీరంతా ఏకమై లాలూచీలతో పోటీని పరిహరించి, పరిహసించి యదేచ్ఛగా కష్టజీవుల చెమటను ఆబగా ఆస్వాదిస్తూ ఉంటారు. వీరి కక్కుర్తికి వారి నిండు జీవితాలు, కుటుంబాలు చిరకాలంగా బలవుతూనే ఉన్నాయి. ముగింపు ఎప్పటికో? ఎన్నటికో? ఆర్థిక నిర్వహణ అభివృద్ధిసంస్థ (ఓఈసీడీ) ఇటీవల ఇచ్చిన నివేదిక ప్రకారం, మనదేశంలో ఈ నియంత్రణ వ్యయం 2020-2022 మధ్య మొత్తం వ్యవసాయ ఉత్పత్తుల ఆదాయంలో 15శాతం. ఈ అధ్యయనం ప్రకారం దేశీయంగా ఉత్పత్తిదారులు సగటున పరోక్షంగా పన్నుల బాధితులు అవుతున్నారు. బడ్జెట్ ద్వారా వారు పొందేది ఏమాత్రం సరిపోవటం లేదు. వారు నిత్యం ఎదుర్కొనే సంక్లిష్ట మార్కెట్ నియంత్రణలు, వాణిజ్య విధానాల లోపభూయిష్ట పద్ధతుల కారణంగా వీరంతా దురవస్థలపాలు అవుతున్నారు. మన అస్తవ్యస్త వ్యవసాయ సంబంధిత మౌలిక సదుపాయాల్లో చేయాల్సింది ఎంతో ఉంది. అమెరికా అంతర్జాతీయ వాణిజ్య పాలన విభాగం ప్రకారం, మన దేశంలో ఈ మౌలిక సదుపాయాల లోపం కారణంగా కొన్ని ఉత్పత్తులు నూర్పిడి అనంతరం 40శాతం వృథా అవుతున్నాయి. ఎవరికీ చెందకుండా పోతున్నాయి. ఆహార ధరల వ్యవస్థ రాజకీయాలతో ముడిపడి ఉంది. ఈ దిశగా తలపెట్టిన వ్యవసాయ చట్టాలు కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలు కాపాడతాయని, వ్యవసాయ రంగాన్ని కుదేలుపరిచి, పెట్టుబడులురాక రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు దిల్లీ పరిసరాల్లో ఏడాదికిపైగా మహత్తరపోరాటం చేయడంతో చట్టాలు ఉపసంహరించుకోక తప్పలేదు. కర్షక, కార్మిక ప్రయోజనాలు అన్ని విధాల పరిరక్షించే చట్టాలు తీసుకువచ్చి, సక్రమంగా అమలు పరచాల్సిన నైతిక బాధ్యత పాలకులపై ఎల్లప్పుడూ ఉంటుంది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం, మన దేశం ప్రపంచంలో 9వ అతి పెద్ద వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారు. మనదేశంలో కోట్లాదిమంది పేదలు ఆకలితో నకనకలాడుతున్నారు. ఆహార సమస్య ప్రపంచం అంతటా ఉంది. 'తనకు మాలిన ధర్మం'లా కాకుండా ఇక్కడి మన అవసరాలు తీర్చుకుంటూనే, ఆయా దేశాల్లోని ఆకలిగొన్న మానవాళికి, విశ్వవ్యాప్తంగా ఆకలితో అలమటించే వారి కడుపు నింపలేని ప్రభుత్వాలు ఉన్నా, లేకున్నా ఒకటే.

సెల్: 9247499715

రామమందిరం వద్ద తొక్కిసలాట

- ప్రధాన ద్వారం వద్ద స్పృహ కోల్పోయిన భక్తుడు
- బాలరాముడి దర్శనానికి పోటెత్తిన భక్తజనం
- అదుపు చేయలేక భద్రతా సిబ్బంది అవస్థ

లక్నో: అయోధ్యలో బాలరాముడి దర్శనం కోసం భక్తులు భారీగా ఎగబడ్డారు. భద్రతా సిబ్బందిని తోసుకుని ముందుకు కదిలారు. దీంతో ఆలయ ప్రాంగణంలో తొక్కిసలాట జరిగి ఒక భక్తుడు గాయపడ్డాడు. దీంతో తీవ్ర గందరగోళం నెలకొంది. సోమవారం అర్ధరాత్రి నుంచే భక్తులు రామ్‌లల్లా దర్శనం కోసం బారులు తీరారు. అలా మంగళవారం మధ్యాహ్నానికి వేలాది మంది భక్తులు రామాలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. ఈ క్రమంలో రామాలయం రోడ్లన్నీ భక్తులతో నిండిపోయాయి. దీంతో భక్తులను అదుపు చేసేందుకు భద్రతా సిబ్బంది తీవ్ర అవస్థలు పడ్డారు. 'జై శ్రీరామ్' నినాదాలు చేస్తూ ఆలయ గేటు దాటేందుకు ప్రయత్నించిన భక్తులను అడ్డుకున్నారు. ఈ సమయంలో ఆలయ ప్రధాన ద్వారం వద్ద తొక్కిసలాట జరిగింది. ఓ భక్తుడు స్పృహతప్పి పడిపోగా... వెంటనే అతడిని భద్రతా సిబ్బంది అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. రద్దీ దృష్ట్యా రాములోరి దర్శనానికి సమయం పడుతుండటంతో భక్తులు సహనం కోల్పోయి విధుల్లో ఉన్న భద్రతా సిబ్బందిని తోసుకుంటూ ఆలయంలోకి ప్రవేశిస్తున్నారు. ప్రస్తుతం అక్కడ పరిస్థితి అదుపులోనే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి నుంచే భక్తులు రాముడి దర్శనానికి బారులు తీరారు. ఉదయం 7 గంటల నుంచి భక్తులను ఆలయంలోకి అనుమతించడం ప్రారంభించారు. ఇక మొదటి రోజు కావడంతో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మంగళవారం మధ్యాహ్నం వరకు అయోధ్య రామయ్యను దాదాపు రెండు లక్షలు మంది దర్శించుకున్నారని ఓ అధికారి చెప్పారు. దర్శన సమయం పూర్తయ్యే సరికి మొత్తం 5లక్షల మంది దర్శించుకుంటారని అంచనా వేసినట్లు తెలిపారు. వేలాది మంది భక్తులు ఇంకా క్యూలో వేచి ఉన్నారని చెప్పారు. భక్తులకు నిరంతర దర్శనం కల్పించేందుకు స్థానిక యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోందని చెప్పారు.

బస్సులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశాలు

రామాలయం వద్ద భక్తుల తాకిడి పెరగడంతో అయోధ్య కలెక్టర్ నితీశ్ కుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రెండు గంటలపాటు బస్సులను అయోధ్య వైపు పంపవద్దని రవాణా శాఖను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో రవాణా శాఖ అప్రమత్తమైంది. లక్నో, ఇతర జిల్లాల నుంచి అయోధ్యకు బస్సులను నడపడం నిలిపివేసింది. అయోధ్య వద్ద గుమిగూడిన భక్తులను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు 100 ఖాళీ బస్సులు అయోధ్యకు పంపించింది. మరోవైపు, అయోధ్యకు భక్తుల తాకిడి పెరగిన నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆలయ పరిసరాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు.

దొంగల హల్‌చల్...భక్తుల నగదు, నగలు మాయం

రామమందిరానికి భక్తులు పోటెత్తిన వేళ దొంగలు కూడా ఇదే అదునుగా భావించి, భక్తుల బ్యాగులను కొట్టేశారు. నగదు, నగలు, ఫోన్లు, ఇతర విలువైన వస్తువులను తస్కరించారు. పూర్ణిమ అనే భక్తురాలు బాలరాముడిని దర్శనం కోసం ఆలయంలోకి ప్రవేశించింది. రాముడిని దర్శనం చేసుకున్న ఆ క్షణాలను అనుభూతి పొందకముందే ఆమె బ్యాగులోని డబ్బు మాయమైనట్లు గ్రహించింది. ఆమె బ్యాగును దొంగలు బ్లేడ్‌తో కోసి, దాంట్లో డబ్బును దొంగిలించారు. ఇతర విలువైన వస్తువులను కూడా అపహరించినట్లు పూర్ణిమ తెలిపారు. వేల సంఖ్యలో భక్తులు తరలిరావడంతో నియంత్రించడం ఆలయ సిబ్బందికి కష్టంగా మారి ఉండొచ్చని పేర్కొన్నారు. అయితే జేబు దొంగలు భక్తులను లక్ష్యంగా చేసుకోవడం సరైంది కాదన్నారు. పూర్ణిమ స్నేహితురాలు ప్రాప్తి(అహ్మదాబాద్) కూడా అయోధ్యకు వచ్చారు. ఆమె బ్యాగ్ జిప్‌ను తీసి, ఆధార్ కార్డు, ఏటీఎం కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇతర డాక్యుమెంట్లను దొంగిలించినట్లు ప్రాప్తి పేర్కొన్నారు. ఆ డాక్యుమెంట్లను మిస్‌యూజ్ చేస్తారేమోననే భయం ఉందని చెప్పారు. తన బ్యాగ్‌ను జాగ్రత్తగా పట్టుకున్నప్పటికీ ఎలా జిప్ తీసి వాటిని అపహరించారో తెలియడం లేదన్నారు ప్రాప్తి. జనవరి 16 నుంచి తాము అయోధ్యలో పర్యటిస్తున్నామని ప్రాప్తి తెలిపారు. ఈ దొంగతనాలకు పాల్పడేది అయోధ్య వాసులు మాత్రం కాదన్నారు. ఇక్కడున్న ఆటో, బస్సు, క్యాబ్ డ్రైవర్లు చాలా మంచివారని చెప్పారు. తాము తమ లగేజీని వారి వద్ద ఉంచి వెళ్లినప్పటికీ, ఎలాంటి వస్తువులు మాయం కాలేదని స్పష్టం చేశారు. పిక్ పాకెటర్స్ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారే అని పేర్కొన్నారు. కాగా చాలా మంది భక్తులకు సంబంధించిన డబ్బు, ఇతర వస్తువులను పిక్ పాకెటర్స్ దొంగిలించినట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. అయితే ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన నేరగాళ్లు దొంగతనాలకు పాల్పడి ఉంటారని అయోధ్య వాసులు అనుమానం వ్యక్తం చేశారు.

ఇక 'బాలక్ రామ్'గా దర్శనం

రామమందిరంలో నూతనంగా ప్రతిష్ఠించిన రామ్‌లల్లాను ఇకపై 'బాలక్ రామ్'గా పిలవనున్నట్లు ట్రస్ట్ పూజారి అరుణ్ దీక్షిత్ వెల్లడించారు. "జనవరి 22న ప్రతిష్ఠించిన శ్రీరాముడి విగ్రహానికి 'బాలక్ రామ్'గా పేరు పెట్టాం. అయోధ్యలో కొలువుదీరిన రామచంద్రమూర్తి ఐదేళ్ల పసిబాలుడిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. అందుకే ఈ పేరును నిర్ణయించాం. ఇకపై ఈ ఆలయాన్ని బాలక్ రామ్ మందిరంగా పిలుస్తాం" అని ఆయన పేర్కొన్నారు. ఇక, ప్రాణప్రతిష్ఠ పూర్తవడంతో హారతి వేళలు, పూజా కార్యక్రమాల్లో కొన్ని మార్పులు చేసినట్లు తెలిసింది. రోజుకు ఆరుసార్లు హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రస్ట్‌కు చెందిన ఆచార్య మిథిలేశ్‌నందిని శరణ్ తెలిపారు. ప్రతిరోజూ మంగళ (నిద్ర లేపేందుకు), శృంగార (అలంకరణ సేవలో), భోగ (నైవేద్య సమర్పణ వేళ), ఉతపన్ (దిష్టి తగలకుండా), సంధ్యా (సాయంత్రం వేళ), శయన హారతి (స్వామి వారిని నిద్ర పుచ్చేందుకు) ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

నైవేద్యం ఇలా...

పూరి, కూరతో పాటు రబ్‌డీ-ఖీర్, పాలు, పండ్లు, పాలతో చేసిన స్వీట్లను రాములవారికి నైవేద్యంగా సమర్పించనున్నారు. సోమవారం తెలుపు, మంగళవారం ఎరుపు, బుధవారం ఆకుపచ్చ, గురువారం పసుపు, శుక్రవారం గోధుమ, శనివారం నీలం, ఆదివారం గులాబీ రంగు వస్త్రాల్లో 'బాలక్ రామ్' దర్శనం ఇవ్వనున్నారు.

దిల్లీలో భారీ భూప్రకంపనలు

న్యూదిల్లీ: దేశ రాజధాని దిల్లీలో భారీ భూప్రకంపనలు సంభవించాయి. సోమవారం అర్ధరాత్రి సమయంలో ఈ ప్రకంపనలు చోటు చేసుకోగా... ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టాలు జరగలేదని అధికారులు చెబుతున్నారు. చైనా దక్షిణ ప్రాంతం జిన్‌జియాంగ్‌లో రిక్టర్ స్కేల్‌పై 80 కిలోమీటర్ల లోతున 7.2 తీవ్రతతో భూమి కంపించింది. ఆ ప్రభావం దిల్లీతో పాటు ఎన్‌సీఆర్‌లోనూ కనిపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ 'ఎక్స్' పోస్ట్‌లో వెల్లడించింది. దేశ రాజధాని ప్రాంతం తరచూ భూ ప్రకంపనలకు కేంద్రంగా ఉంటోంది. పొరుగు దేశాల్లో ఎక్కడ భూమి కంపించినా ఏ స్థాయిలో ప్రకంపనలు సంభవించినా ఆ ప్రభావం దిల్లీ రీజియన్‌లో కనిపిస్తోంది. జనవరి 11న దిల్లీ, ఎన్‌సీఆర్ ప్రాంతంలో 6.1 తీవ్రతతో అఫ్గానిస్తాన్‌లో భూకంపం సంభవించగా, పాకిస్తాన్‌తో పాటు దిల్లీ, పంజాబ్ తదితర ప్రాంతాల్లోనూ భూమి కంపించింది. అంతకు ముందు నేపాల్ భూకంప ప్రభావమూ కనిపించింది.

రామభక్తులంతా బీజేపీ మద్దతుదారులా: థరూర్

తిరువనంతపురం: ప్రతి రామభక్తుడు బీజేపీ మద్దతుదారుడు కాదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ అన్నారు. తనతోపాటు చాలామంది రామభక్తులు ఉన్నారని, తామంతా భవిష్యత్‌లో అయోధ్యకు వెళ్లి తమ భక్తిని చాటుకుంటామని, ఎవరినీ మనస్తాపానికి గురిచేయబోమని చెప్పారు. సెక్యులరిజం అంటే మతాన్ని విడనాటడం కాదని, ఎవరికి ఇష్టమైన మతాన్ని వారు ఆచరించవచ్చని థరూర్ అన్నారు. సామాజిక మాధ్యమం వేదికగా తాను రాముడికి సంబంధించి చేసిన పోస్టుపై ఎస్ఎఫ్ఐ, ప్రభుత్వ న్యాయకళాశాల అధ్యాపకులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో థరూర్ మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. శశిథరూర్‌కు వ్యతిరేకంగా ఆందోళనకారులు నినాదాలు చేశారు. శశిథరూర్ ప్రజాస్వామిక లౌకిక రాజ్యాన్ని అవమానించారని నిందించారు. ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. సియావర్‌కీ రామ్ జై అంటూ శశిథరూర్ అయోధ్య రాముడి బొమ్మతో ఎక్స్‌లో పోస్టు చేశారు. రాముడి పట్ల తనకు గల భక్తితో ఆ పోస్టు పెట్టానని థరూర్ చెప్పుకున్నారు. దీనిని పెద్ద సమస్యగా చేయాల్సిన అవసరం లేదన్నారు. రామభక్తులంతా తమకే ఓటేయాలని బీజేపీ కోరుకుంటున్నదని, అయితే, ప్రతి రామభక్తుడు బీజేపీ మద్దతుదారుడు కాదని ఆయన అన్నారు. రాముడిని బీజేపీకి మాత్రమే కాంగ్రెస్ ఎందుకు వదులుతుందని ఆయన ప్రశ్నించారు. రామాలయాన్ని కాంగ్రెస్‌లో ఏ ఒక్కరూ వ్యతిరేకించడం లేదని, ఆ కార్యక్రమం జరిగిన తీరునే తప్పుపడుతున్నామన్నారు. తాను ఆలయానికి వెళితే రాముడికి పూజ చేస్తానని, రాజకీయ ప్రయోజనం కోసం వెళ్లనని థరూర్ చెప్పారు.

రాముడితో మా బంధాన్ని విడదీయలేరు: రౌత్

నాసిక్: రాముడితో తమ పార్టీకి ఎంతో అనుబంధం ఉందని శివసేన(ఉద్ధవ్) పార్టీ నాయకుడు సంజయ్ రౌత్ మంగళవారం చెప్పారు. తాము అయోధ్యకు వెళ్లనంత మాత్రాన ఆలయంలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన ఆగబోదన్నారు. నాసిక్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో సంజయ్‌రౌత్ ప్రసంగిస్తూ రాముడితో తమ పార్టీకి పాత సంబంధాలే ఉన్నాయన్నారు. రాముడితో శివసేనకు మరచిపోలేని అనుభూతులు ఉన్నాయన్నారు. ఇది ఏ ఒక్క మనిషికో...పార్టీకో కాదని, రాముడు అందరి దేవుడన్నారు. శివసేన లేనంత మాత్రాన రాముడి విగ్రహ ప్రతిష్ఠ ఆగబోదన్నారు. రామజన్మభూమి ఉద్యమంలో తమ పాత్రపై శివసేన(ఉద్ధవ్), బీజేపీ రాష్ట్ర శాఖ మధ్య మాటలయుద్ధం జరుగుతున్న వేళ సంజయ్‌రౌత్ ఈ వ్యాఖ్యలు చేశారు. రామజన్మభూమి ఉద్యమంలో ఉద్ధవ్ ఠాక్రే, ఆయన తనయుడు ఆదిత్య, సంజయ్‌రౌత్ పాత్రపై బీజేపీ ప్రశ్నించిన విషయం విదితమే.

సోరెన్‌కు మరోసారి ఈడీ నోటీసులు

న్యూదిల్లీ: మనీలాండరింగ్ కేసులో జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌కు ఈడీ మరోసారి నోటీసులు జారీచేసింది. ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ కింద వాంగ్మూలం నమోదు ఇంకా పూర్తికాలేదని... మరోసారి ప్రశ్నించాల్సి ఉందని పేర్కొంది. ఈ నేపథ్యంలో జనవరి 27 నుంచి 31లోగా జోనల్ కార్యాలయానికి రావాలని అందులో పేర్కొంది. ఇదే కేసులో ఈనెల 20న ఈడీ సుదీర్ఘంగా ప్రశ్నించిన విషయం తెలిసిందే. గత శనివారం రాంచీలోని సీఎం అధికారిక నివాసానికి చేరుకున్న ఈడీ అధికారులు... సుమారు 7 గంటలపాటు ప్రశ్నల వర్షం కురిపించారు. ఆయన వాంగ్మూలాన్ని నమోదు చేశారు. జార్ఖండ్‌లో భూమి యాజమాన్యాన్ని అక్రమంగా మార్చే భారీ మాఫియాకు సంబంధించిన కుంభకోణంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే 14 మందిని ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. కాగా, భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో హేమంత్ సోరెన్‌కు ఈడీ ఇప్పటికే ఏడుసార్లు సమన్లు జారీ చేసింది.

కృష్ణుడి ఆలయం నిర్మించేవరకు ఒంటిపూట భోజనం

రాజస్థాన్ మంత్రి ప్రతిజ్ఞ

కోట (రాజస్థాన్): శ్రీకృష్ణ జన్మస్థలమైన మధురలో కృష్ణుడి ఆలయాన్ని నిర్మించే వరకు రోజుకు ఒక్కసారి మాత్రమే భోజన చేస్తానని రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ ప్రతిజ్ఞ చేశారు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జరిగాక దిలావర్ అప్పట్లో చేసిన ప్రతిజ్ఞను వీడి అనేక ఏళ్ల తర్వాత పూలమాలను ధరించారు. రామమందిరం నిర్మించే వరకు మెడలో మాల ధరించనని ఆర్ఎస్ఎస్ సభ్యుడైన మదన్ దిలావర్ అనేక ఏళ్ల క్రితం ప్రతిజ్ఞను చేశారు. రామమందిర నిర్మాణం కల సాకారం కావడంతో భారీ మాలను ధరించి దీక్షను విరమించారు. 34కిలోల బరువున్న పూల మాలను బీజేపీ కార్యకర్తలు ముందుగా శ్రీరాముడికి సమర్పించి అనంతరం దీవెనగా మదన్ మెడలో వేశారు. అయితే మదన్ ఆరుసార్లు ఎమ్మెల్యేగా, మూడుసార్లు మంత్రి అయ్యాక కూడా ఎలాంటి పరిస్థితుల్లో మెడలో పూలమాల వేసుకోలేదు. ఈ సందర్భంగా తన కరసేవ జ్ఞాపకాలను వివరించిన మదన్ దిలావర్ మరో ప్రతిజ్ఞ చేశారు. శ్రీకృష్ణ జన్మస్థలమైన మధురలో కృష్ణుడి ఆలయాన్ని నిర్మించే వరకు రోజుకు ఒక్కసారి మాత్రమే భోజన చేస్తానని చెప్పారు. రామ మందిర నిర్మాణంపై ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. స్థానికంగా ఉన్న ఓ మహిళ ఇంట్లో భోజనం చేసి ఆమెకు చీర, రూ.51వేలు కానుకగా ఇచ్చారు. రామ్‌గంజ్ మండిలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జరిగిన ర్యాలీలో డ్రమ్ము వాయించారు.

మిజోరంలో మైన్మార్ విమానానికి ప్రమాదం

8 మందికి గాయాలు

ఐజ్వాల్: మిజోరం రాజధాని ఐజ్వాల్‌లోని లెంగ్‌పుయ్ విమానాశ్రయంలో మంగళవారం ఉదయం 10:19 గంటలకు ప్రమాదం చోటు చేసుకుంది. మైన్మార్ నుంచి వచ్చిన సైనిక విమానం ల్యాండింగ్ సమయంలో అదుపుతప్పి, రన్‌వేపై స్కిడ్ అయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మైన్మార్ సిబ్బంది గాయపడ్డారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. కొన్నాళ్ల క్రితం సరిహద్దులు దాటి భారత్‌లోకి చొరబడి తమ దేశ సైనికులను వెనక్కి తీసుకెళ్లేందుకు ఈ విమానం వచ్చింది. ప్రమాదం జరిగినప్పుడు విమానంలో 13 మంది సిబ్బంది ఉన్నట్లు సమాచారం.

గణతంత్ర దినోత్సవం...
కశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం

శ్రీనగర్: కశ్మీర్‌లో గణతంత్ర దినోత్సవం సందర్భంగా లోయలో వేడుకలు సజావుగా, శాంతియుతంగా జరిగేలా చూసేందుకు భద్రతను కట్టుదిట్టం చేసినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. నగరంతో పాటు ఇతర జిల్లా కేంద్రాల్లో పోలీసులు, సాయుధ బలగాలను మోహరించామన్నారు. శ్రీనగర్‌లోని వివిధ ప్రదేశాలలో, ముఖ్యంగా నగరం, ఇతర జిల్లాల ప్రవేశ పాయింట్ల వద్ద చెక్‌పోస్టులను చేసినట్లు వివరించారు. విధ్వంసకర శక్తుల కదలికలను అడ్డుకునేందుకు భద్రతా బలగాలు వాహనాలతో పాటు ప్రజలను తనిఖీ చేయడం వంటివి చేస్తున్నాయని వారు తెలిపారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా అధ్యక్షతన జమ్మూలో ప్రధాన గణతంత్ర దినోత్సవ కార్యక్రమం జరగనుండగా, లోయలో అతిపెద్ద కార్యక్రమం ఇక్కడి బక్షి స్టేడియంలో జరగనుంది. జిల్లా కేంద్రాల్లోనూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇక్కడి స్టేడియంతో సహా లోయలోని గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వేదికల చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశామని, వేదికల చుట్టూ బహుళస్థాయి భద్రతను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించడానికి ఎవరినీ అనుమతించవద్దని, అప్రమత్తంగా ఉండాలని భద్రతా సంస్థలను కోరినట్లు చెప్పారు. 'ఏర్పాట్లన్నీ సక్రమంగా ఉన్నాయి. అవసరమైన చర్యలు తీసుకున్నాం. భద్రతను పెంచాం. మేము శ్రీనగర్‌లో లేదా లోయలోని మరెక్కడైనా వేడుకలు సజావుగా జరిగేలా చూస్తాం' అని కశ్మీర్ పోలీసు ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీపీ) వి.కె.బిర్ది పీటీఐకి తెలిపారు. కాగా, పోలీసు డైరెక్టర్ జనరల్ (డీజీపీ) ఆర్.ఆర్.స్వైన్ శనివారం జమ్మూకశ్మీర్ అంతటా భద్రతా చర్యలను ఉన్నత స్థాయి సమావేశంలో సమీక్షించారు. బుధవారం లోయలోని బక్షి స్టేడియం, ఇతర వేదికలలో రిహార్సల్ జరుగుతుంది.

184 మంది మైన్మార్ సైనికులు వెనక్కి

న్యూదిల్లీ: అంతర్యుద్ధం కారణంగా అట్టుడుకుతున్న మైన్మార్ నుంచి భారీగా సైనికులు భారత్‌లోకి చొరబడుతున్నారు. కొన్నాళ్ల క్రితం మిజోరంలోకి ప్రవేశించిన 184 మంది సైనికులను సోమవారం భారత్ వెనక్కి పంపింది. ఈ విషయాన్ని అస్సాం రైఫిల్స్ వెల్లడించింది. మరో 92 మందిని నేడు మైన్మార్‌కు పంపిస్తామని తెలిపింది. గత వారం అరాకన్ ఆర్మీ సాయుధులు మయన్మార్ సైనిక స్థావరంపై దాడి చేశారు. దీంతో మొత్తం 276 మంది అక్కడి సైనికులు భారత్‌లో చొరబడ్డారు. ఇందుకోసం వారు భారత్-మైన్మార్-బంగ్లాదేశ్ కూడలిలోని బందూక్‌బంగా గ్రామాన్ని వాడుకున్నారు. ఇది దక్షిణ మిజోరంలో ఉంది. వీరి వద్ద ఆయుధాలు, మందుగుండు సామగ్రి కూడా ఉన్నాయి. వీరు నేరుగా పర్వాలోని అస్సాం రైఫిల్స్ క్యాంప్‌లో లొంగిపోయారు. నాటి నుంచి అస్సాం రైఫిల్స్ వారి బాగోగులు చూసుకుం టోంది. వీరిని శనివారం ఆయిజోల్‌కు తరలించారు. అక్కడి లెంగ్‌పుయ్ విమానా శ్రయం నుంచి మైన్మార్‌కు పంపించారు. ఈ గ్రూపులో కర్నల్, 36 మంది ఆఫీసర్లు, 240 మంది జవాన్లు ఉన్నారు. 2021 నుంచి మైన్మార్‌లో కల్లోల పరిస్థితులు నెలకొన్నాయి. ఇక్కడ ప్రజా ప్రభుత్వాన్ని సైన్యం కూలదోయడంతో అంతర్యుద్ధానికి బీజం పడింది. 'త్రీబ్రదర్‌హుడ్ అలయన్స్' భారీ ఎత్తున సైన్యంపై దాడులు మొదలుపెట్టింది. ఇందులో మైన్మార్ జాతీయ ప్రజాస్వామ్య కూటమి సైన్యం (ఎంఎన్‌డీఏఏ), టాంగ్ జాతీయ విమోచన సైన్యం (టీఎన్ఎల్ఏ), అరాకన్ ఆర్మీ (ఏఏ) భాగస్వామ్య పక్షాలుగా ఉన్నాయి. దేశంలో అత్యంత శక్తిమంతమైన సాయుధ తిరుగుబాటు సంస్థలుగా వీటికి పేరుంది. ఇవి కీలక పట్టణాలను స్వాధీనం చేసుకొని సమాంతర ప్రభుత్వాన్ని నిర్వహిస్తున్నాయి. వీరి దాడులు తట్టుకోలేక వందల మంది సైనికులు భారత్‌లోకి చొరబడుతున్నారు.

మహువా అవినీతి కేసులో
దేహద్రాయ్‌కి సీబీఐ సమన్లు

న్యూదిల్లీ : టీఎంసీ నేత, బహిష్కృత లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా అవినీతి కేసులో వాదనలు వినిపిస్తున్న సుప్రీం కోర్టు న్యాయవాది జై అనంత్ దేహద్రాయ్‌కి కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) మంగళవారం సమన్లు జారీ చేసింది. మహువా అవినీతి కేసుకు సంబంధించి గురువారం విచారణకు హాజరు కావాలని సీబీఐ పేర్కొంది. లోక్‌సభలో ప్రశ్నలు అడిగేందుకు పారిశ్రామికవేత్త హీరానందాని నుంచి మొయిత్రా డబ్బులు, ఖరీదైన కానుకలు తీసుకున్నారని, ఆమె పార్లమెంట్ లాగిన్ వివరాలను దుబాయ్ నుంచి యాక్సెస్ చేశారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేపట్టిన నైతిక విలువల కమిటీ మహువా మొయిత్రాతో పాటు ఆమెపై ఫిర్యాదు చేసిన బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే, న్యాయవాది దెహద్రాయ్‌ను కమిటీ విచారించింది. నిబంధనలకు విరుద్ధంగా తన పార్లమెంట్ లాగిన్ వివరాలను బయటి వ్యక్తులకు ఇచ్చినట్లు కమిటీ నిర్ధారించింది. ఈ క్రమంలోనే ఆమెను లోక్‌సభ నుంచి బహిష్కరిస్తున్నట్లు స్పీకర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే ఈ వ్యవహారంపై పార్లమెంటులో పెద్ద చర్చ కూడా జరిగింది. పశ్చిమ్ బెంగాల్‌కు చెందిన కొందరు పోలీసు అధికారులతో ఉన్న పరిచయాలతో మహువా తనపై అక్రమంగా నిఘా ఉంచారని డిసెంబరులో దెహద్రాయ్ సీబీఐకి లేఖ రాశారు. తన ఫోన్ నంబర్‌తో, తాను ఎక్కడున్నాననే విషయాన్ని ట్రాక్ చేసే అవకాశం ఉందని ఆ లేఖలో ఆరోపించారు. ఇటీవల ఎంపీ హోదాలో మహువాకు కేటాయించిన బంగ్లాను ఖాళీ చేయాలని డైరెక్టరేట్ ఆఫ్ ఎస్టేట్స్ నోటీసులు పంపింది. అయితే తనకు ఆ బంగ్లాను కొనసాగించాలని మహువా కోర్టును ఆశ్రయించారు. అక్కడ కూడా ఆమెకు అనుకూలంగా రాకపోవడంతో బంగ్లాను ఖాళీ చేశారు.

దూసుకెళ్లిన రైలు: ముగ్గురు ఉద్యోగుల మృతి

ముంబై: ముంబై డివిజన్ పరిధిలో ఘోరం జరిగింది. సిగ్నలింగ్ వ్యవస్థను సరిదిద్దుతున్న ఉద్యోగులపై నుంచి లోకల్ ట్రైన్ దూసుకెళ్లింది. దీంతో ముగ్గురు మృతి చెందారు. వివరాల్లోకి వెళితే... మహారాష్ట్ర పాల్ఘర్ జిల్లా పరిధిలోని వాసయి రోడ్డు, నైగావ్ స్టేషన్ల మధ్య సిగ్నలింగ్ వ్యవస్థలో లోపం తలెత్తింది. దాన్ని సరి చేసేందుకు ముగ్గురు ఉద్యోగులు సోమవారం సాయంత్రం అక్కడికి చేరుకున్నారు. రాత్రి 8:55 గంటల సమయంలో సిగ్నల్‌ను సరి చేస్తున్న వారిపై నుంచి చర్చ్‌గేట్ వైపు వెళుతున్న లోకల్ ట్రైన్ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు అక్కడికి చేరుకుని, మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులను చీఫ్ సిగ్నలింగ్ ఇన్‌స్పెక్టర్ వాసు మిత్ర, ఎలక్ట్రికల్ సిగ్నలింగ్ మెయింటైనర్ సోమనాథ్ ఉత్తమ్, హెల్పర్ సచిన్ వాంఖడేగా పోలీసులు గుర్తించారు. తక్షణ సాయం కింద మృతుల కుటుంబాలకు రూ.55 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి, నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారులు కోరారు.

కోవిడ్ వ్యాప్తితో ఆందోళన

- మరో మూడు మరణాలు
- తాజాగా 263 కేసులు... 1,640కి పెరిగిన జేఎన్.1 ఉపరకం

న్యూదిల్లీ: దేశంలో కోవిడ్ మహమ్మారి క్రమంగా వ్యాప్తి చెందుతోంది. మంగళవారం ఉదయం 8 గంటల వరకు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అందించిన వివరాల ప్రకారం... తాజాగా 236 కోవిడ్ కేసులు నమోదు కావడంతో క్రియాశీల కేసుల సంఖ్య 2,031గా ఉంది. 24 గంటల వ్యవధిలో మూడు కొత్త మరణాలు సంభవించాయి. కర్నాటకలో ఒకరు, పశ్చిమ బెంగాల్‌లో ఇద్దరు ఉన్నారు. గత ఏడాది డిసెంబరు 5 వరకు రోజువారీ కేసుల సంఖ్య రెండంకెలకు పడిపోయింది. అయితే కొత్త ఉపరకం ఉద్భవించడం, శీతల వాతావరణ పరిస్థితులు ప్రారంభమైన తర్వాత అవి మళ్లీ పెరగడం ప్రారంభిం చాయి. డిసెంబరు 31 ఒక్క రోజులో 841 కొత్త కేసులు నమోదయ్యాయి. ఇది మే 2021లో నమోదయిన గరిష్ఠ కేసుల్లో 0.2 శాతం అని అధికారిక వర్గాలు తెలిపాయి. మొత్తం క్రియాశీల కేసుల్లో వీటిలో ఎక్కువ మంది (సుమారు 92 శాతం) హోమ్ ఐసోలేషన్‌లో కోలుకుంటున్నారు. 'ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం... జేఎన్.1 ఉపరకం కొత్త కేసులలో పెరుగుదల లేదా ఆస్పత్రుల్లో చేరడం, మరణాల పెరుగుదలకు దారితీయదని సూచిస్తుంది' అని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇదిలాఉండగా, దేశంలో ఇప్పటివరకు మొత్తం 1,640 కోవిడ్-19 ఉపరకం జేఎన్.1 కేసులు నమోదయ్యాయి. మధ్య ప్రదేశ్ దాని ఉనికిని నమోదు చేసిన తాజా రాష్ట్రంగా అవతరించించినట్లు ఇన్‌సాకాగ్ మంగళవారం తెలిపింది. మహారాష్ట్రలో అత్యధికంగా జేఎన్.1 కేసులు 477 నమోదు కాగా, కర్నాటకలో 249 కేసులు నమోదయ్యాయి. ఆంధ్ర ప్రదేశ్‌లో 219, కేరళలో 156, గుజరాత్‌లో 127, పశ్చిమ బెంగాల్‌లో 96, గోవాలో 90, తమిళనాడులో 89 జేఎన్.1 కేసులు నమోదయ్యాయి. రాజస్తాన్‌లో 38, తెలంగాణలో 32, చత్తీస్‌గఢ్‌లో 25, దిల్లీలో 21, ఉత్తర ప్రదేశ్‌లో 9, హరియానాలో 5, ఒడిశాలో మూడు, ఉత్తరాఖండ్, మణిపూర్, మధ్య ప్రదేశ్, నాగాలాండ్‌లో ఒక్కొక్కటి చొప్పున జేఎన్.1 కేసులు నమోదయ్యాయి. డిసెంబరులో అత్యధికంగా 1,291 కేసులు, జనవరిలో 315 కేసులు నమోదయ్యాయి.

హార్సిలీ హిల్స్ భూముల గోల్‌మాల్

- హౌస్ బిల్డింగ్ సొసైటీలో భారీ అక్రమాలు
- నిషేధం ఉన్నా రిజిస్ట్రేషన్ల జోరు
- పట్టించుకోని పాలకులు

విశాలాంధ్ర- బి.కొత్తకోట: ప్రముఖ పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీలో భారీగా అక్రమాలు జరుగుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. హార్సిలీ హిల్స్‌లో క్రయవిక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించినా గుట్టుచప్పుడు కాకుండా సొసైటీ సభ్యులు బినామీల పేరుతో రిజిస్ట్రేషన్లు జోరుగా సాగిస్తున్నారు. ఆంధ్ర ఊటీగా పేరుగాంచిన హార్సిలీ హిల్స్ సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉంది. ఇక్కడ ఆహ్లాదకర వాతావరణం, అందమైన లొకేషన్లు, ప్రకృతి సంపద, పచ్చదనం అందరినీ ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. రాష్ట్రంలో ఏకైక వేసవి విడిది కేంద్రంగా గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం 1961లో గవర్నర్ విడిది కోసం ఇక్కడ బంగ్లాను నిర్మించింది. ఇక్కడ అభివృద్ధి కోసం 1974లో హార్సిలీ హిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఏర్పాటు చేశారు. కొంతమంది ప్రముఖులు సొసైటీలో సభ్యులుగా చేరారు. ఇంటి స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరడంతో ఈ సొసైటీకి 21 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. కొంతమంది సొసైటీ సభ్యులకు కొంత స్థలంలో ప్లాట్లు కేటాయించారు. అయితే సొసైటీలో బినామీ సభ్యులను చేర్పించడం, ఇష్టానుసారం ప్లాట్లు కేటాయించడం ద్వారా భారీ ఎత్తున అవినీతి, అక్రమాలు పెరిగాయి. సొసైటీ అధ్యక్షుడే భారీగా అక్రమాలకు పాల్పడినట్లు ప్రభుత్వానికి ఫిర్యాదులు అందాయి. కొండపై ప్రైవేటు పెత్తనం బాగా పెరిగింది. కొండపై అక్రమాలను అరికట్టడానికి, భూముల పరిరక్షణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న దృఢ సంకల్పంతో పర్యాటక శాఖ అధ్వర్యంలో హిల్స్‌పై అతిథి గృహాలు నిర్మించారు. ఇప్పటికే హర్సిలీ హిల్స్‌పై అటవీశాఖ, రెవెన్యూ, ఉద్యానవనశాఖ, రైల్వే, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లకు అతిథి గృహాలు ఉన్నాయి. వీటి ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని హార్సిలీ హిల్స్‌పై ప్రైవేటు, రాజకీయ నాయకుల జోక్యం లేకుండా చేయడానికి 2001లో ప్రభుత్వం హార్సిలీ హిల్స్ టౌన్‌షిప్ కమిటీ ఏర్పాటు చేసింది. దేశంలోనే అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా ఉన్న మదనపల్లి సబ్ కలెక్టర్ కమిటీకి చైర్మన్‌గా డివిజన్‌లోని కీలకశాఖ అధికారులు సభ్యులుగా ఉన్నారు. కమిటీ అధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేలా ప్రభుత్వం నిర్ణయించింది. మదనపల్లి సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన వారు హార్సిలీహిల్స్ టౌన్ షిప్ కమిటీ చైర్మన్ హోదాలో ప్రభుత్వ భూములు కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్వర్యంలో ఉన్న భూములు అన్యాక్రాంతమైనట్లు కమిటీ గుర్తించింది. దీంతో 2005, 2006లో హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించి అన్యాక్రాంతమైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. మొత్తం 21 ఎకరాలలో 9 మంది సభ్యులు ఒక్కొక్కరికి ఐదు సెంట్లు చొప్పున 45 సెంట్లు పోగా మిగిలిన 20 ఎకరాల 50 సెంట్ల భూమిని పూర్తిగా ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. సొసైటీ అక్రమాలకు ముకుతాడు వేసింది. అక్రమాలకు పాల్పడిన హౌస్ బిల్డింగ్ సొసైటీ అప్పటి అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డిపై క్రిమినల్ కేసులు పెట్టారు. అయితే ఆయన వివిధ కోర్టుల్లో ప్రభుత్వ అధికారులపై కేసులు వేయడంతో హౌస్ బిల్డింగ్ సొసైటీ భూములపై కోర్టుల్లో కేసులు నడుస్తున్నాయి. హార్సిలీ హిల్స్‌లో స్థలాల క్రయవిక్రయాలు లేదా రిజిస్ట్రేషన్ చేయరాదని ప్రభుత్వం నిబంధనలు విధించింది. టౌన్‌షిప్ కమిటీ అనుమతి లేకుండా ఏ ఒక్క ఇటుక పెట్టరాదని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇలా హార్సిలీ హిల్స్ పరిరక్షణకు ప్రభుత్వం గట్టి చర్యలు తీసుకుంది. అయితే రాష్ట్ర విభజన తర్వాత హార్సిలీ హిల్స్‌పై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవట, సబ్ కలెక్టర్లు కాకుండా మదనపల్లి డివిజన్‌కు ఆర్డీవోల నియామకం జరగడంతో బిల్డింగ్ సొసైటీకి కొత్తగా వచ్చిన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అక్రమాలకు తెర లేపారు. సొసైటీకి చెందిన 21 ఎకరాలలో 14 ఎకరాలకు లేఅవుట్ రూపొందించి ప్లాట్లు కేటాయింపు పేరుతో భారీ వసూళ్లకు పాల్పడుతున్నారు. సభ్యులు కానివారిని సొసైటీలో చేర్చి...భారీ అవకతవకలకు పాల్పడ్డారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు ద్వారకానాథ్‌రెడ్డి కొత్త అధ్యక్షుడు రాజేంద్ర ప్రసాద్‌రెడ్డిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఇలా ద్వారకానాథ్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్‌రెడ్డి పరస్పరం కేసులు వేసుకోవడంతో సొసైటీలో జరుగుతున్న అక్రమాల గురించి మరింత విస్తృతంగా ప్రచారం జరిగింది. దీంతో రాజేంద్రప్రసాద్‌రెడ్డి అధ్యక్ష బాధ్యతల నుండి తప్పుకొని మరొకరిని అధ్యక్షుడిగా నియమించి...తాను ప్రధాన కార్యదర్శిగా ఎన్నికై సొసైటీని నియంతల వాడు కుంటున్నారు. ఇష్టానుసారం సభ్యులను చేర్చుకున్నట్లు సంబంధిత రికార్డులు రుజువు చేస్తున్నాయి. సొసైటీలో 800 మందికిపైగా సభ్యులు ఉన్నట్లు సమాచారం. అందులో 150 మంది నుండి మూడు నుండి ఐదు లక్షల రూపాయల చొప్పున వసూలు చేసుకుని ప్లాట్లు కేటాయించినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇందులో 100 మందికి ప్లాట్లు బి.కొత్తకోట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేసినట్లు సమాచారం. కోర్టులో కేసులు సొసైటీకి అనుకూలంగా వచ్చేలా రెవెన్యూ అధికారులతో లోపాయికారి ఒప్పందాలు చేసుకున్నట్లు తెలుస్తోంది. గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారులు, హార్సిలీ హిల్స్ టౌన్‌షిప్ కమిటీ అధికారులు సొసైటీ అక్రమాలకు కళ్లెం వేయగా ఇటీవల టౌన్‌షిప్ అధికారులు, రెవెన్యూ అధికారులు సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. భారీగా ముడుపులు చెల్లించడం ద్వారా స్థలాలను రిజిస్ట్రేషన్లు చేశారు. కోర్టులో కేసులు కొనసాగుతున్నప్పటికీ లోపాయికారిగా రిజిస్ట్రేషన్లు జరిగిపోవడం విశేషం. సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు రెవెన్యూ అధికారులకు భారీగా ముడుపులు ముట్టచెప్పి ఈ విషయాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. సొసైటీలో ఎంతమంది సభ్యులు ఉన్నారు. సొసైటీకి ఎన్ని కోట్ల నిధులు ఉన్నాయి. ఆ నిధులపై వస్తున్న ఆదాయం ఏమవుతుంది అనేది అంతుబట్టని రహస్యం. ఇదిలాగే కొనసాగితే హార్సిలీ హిల్స్ ప్రైవేట్‌పరమయ్యే సూచనలు కనిపిస్తున్నట్లు కొంతమంది ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని హిల్స్‌లోని భూములు అన్యాక్రాంతం కాకుండాచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ముఖ్యంగా సొసైటీలో జరుగుతున్న భారీ అక్రమాలను వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

డీఎల్‌సీఓ వివరణ

ఈ విషయంపై మదనపల్లి డీఎల్‌సీఓ అధికారి రవిచంద్రన్ వివరణ కోరగా...తనకేమీ తెలియదని, తాను కొత్తగా ఇక్కడ బాధ్యతలు స్వీకరించానని, రెండు రోజుల వరకు తాను కార్యాలయానికి రానని తెలిపారు. తాను విధులకు వచ్చిందీ లేనిదీ తమ కార్యాలయానికి ఫోన్ చేసి...రావచ్చని అన్నారు.

ప్రగతికి సాంస్కృతిక విప్లవం అవశ్యం

ఓబులేసు ఉద్ఘాటన

విశాలాంధ్ర-విజయవాడ (చిట్టినగర్): భారతదేశ అభ్యుదయ ప్రగతికి సాంస్కృతిక విప్లవం అవసరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఓబులేసు అన్నారు. సోషలిస్టు వ్యవస్థాపకులు, మహోన్నత నేత కామ్రేడ్ వీఐ లెనిన్ శత వర్ధంతి సందర్భంగా విజయవాడ లెనిన్ విగ్రహం వద్ద జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో ఓబులేసు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఓబులేసు మాట్లాడుతూ దేశంలో విగ్రహ రాజకీయాలు నడుస్తున్నాయని విమర్శించారు. పాలకులే మూఢ విశ్వాసాలను ప్రోత్సహిస్తున్నారని, విద్వేషభావజాలం పెంచుతున్నారని మండిపడ్డారు. రాజకీయాలలోకి మతాన్ని తెచ్చి ప్రజలను భ్రష్టు పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దేశ ప్రగతికి లెనిన్ సిద్ధాంత భావజాలం ఆవశ్యకత పెరిగిందన్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థ అత్యున్నత రూపం సోషలిస్టు వ్యవస్థని నిరూపించిన మహనీయుడు లెనిన్ అన్నారు. రష్యాలో అంతరాలు తొలగించి సమసమాజాన్ని నిర్మించిన గొప్ప మేధావి, మార్గదర్శకుడన్నారు. మోదీ సర్కారు దేశవనరులను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న పరిస్థితుల్లో లెనిన్ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజానాట్యమండలి సాంస్కృతిక, కళా రూపాలతో ప్రజల్ని చైతన్యవంతులను చేయాలని విజ్ఞప్తి చేశారు. సీపీఎం రాష్ట్ర నాయకులు ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ ఎన్ని దేవాలయాలు కడితే ప్రజల ఆకలిసమస్యలు తీరతాయని, ఉద్యోగ సమస్యలు పోతాయని, మైనార్టీ సోదరులకు ధైర్యాన్నిస్తాయని ప్రశ్నించారు. ఆకలి కేకలతో, బాధలతో దేశం 111వ స్థానంలో ఉందని, ఈ సమస్యలపై నిలదీసేందుకు ప్రాంతీయ పార్టీలకు, పాలకులకు ధైర్యం లేదన్నారు. ఈ బాధల నుండి ప్రజలు బయట పడాలంతే మార్క్సిజం, లెనినిజమే శరణ్యమన్నారు. కష్టజీవులు అధికారం చేపడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని, దీనిని రష్యాలో లెనిన్ నిరూపించారన్నారు. బాధలన్నింటికీ పరిష్కారం ప్రజల చేతుల్లోనే ఉందన్నారు. ధైర్యంగా పాలకులను ప్రశ్నించేవారికి ఎర్రజెండాలు, వామపక్ష పార్టీలు బాసటగా నిలుస్తాయని తెలిపారు. సుదర్శన్ రాజు, ఫణీంద్ర, జయప్రద సినీ, విప్లవ గేయాలు ఆలపించి ఉత్తేజాన్ని నింపారు. లంకా దుర్గారావు కుటుంబ సభ్యులు ప్రదర్శించిన నృత్య రూపకం ఆలోచింప చేసింది. నిర్వహణ కమిటీ సభ్యులు, సాహితి పోషకులు గోళ్ల నారాయణరావు, బుడ్డిగ జమిందార్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు, ప్రజాశక్తి బుక్‌హౌస్ మేనేజర్ కె.లక్ష్మయ్య పర్యవేక్షించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య, నాయకులు ఎస్‌కే నజీర్, శర్మ, ఎల్.దుర్గారావు, కేవీ భాస్కరరావు, ఎస్.రంగారావు, డి.సూరిబాబు, ఎస్.అనిల్, పి.అప్పన్న, జగన్ అభ్యుదయ విప్లవ గీతాలు ఆలపించి... శ్రోతల్లో ఉత్తేజం నింపారు. వామపక్ష నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య, జి.కోటేశ్వరరావు, నక్కా వీరభద్రరావు, పి.ప్రసాద్, దివి కుమార్, సాహితి వేత్తలు గుమ్మ సాంబశివరావు, వెన్న వల్లభరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో 150 మంది చేరిక

విశాలాంధ్ర-శృంగవరపుకోట: విజయనగరం జిల్లా ఎస్.కోట పట్టణం లోని బర్మా కాలనీ, శ్రీనివాస కాలనీ, మండలంలోని గోపాలపల్లి గ్రామాలకు చెందిన 150 మంది భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) లో చేరారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు అధ్వర్యంలో మంగళవారం పార్టీలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ సీపీఐ కార్మికులు, పేదలు, రైతులు, ఉద్యోగుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేసిందని, చేస్తూనే ఉందని గుర్తు చేశారు. భూమి, ఇళ్ల స్థలాలు లేని కొన్ని వేల మంది పేదలకు వాటిని చేకూర్చి అండగా నిలిచిందన్నారు. అధికారం కన్నా పేద ప్రజలు, కార్మికులు, రైతు సమస్యల పరిష్కారానికే తమవంతుగా నిరంతర పోరాటాలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. పార్టీలో చేరిన వారంతా నిబద్ధతతో పని చేయాలని... ఎవరికి ఏ కష్టమొచ్చినా అందరం ఒక్కటై పోరాడుదామని కామేశ్వరరావు స్పష్టం చేశారు. పార్టీలో చేరిన అనేక మంది మాట్లాడుతూ వైసీపీ, తెలుగుదేశం వంటివి బూర్జువా పార్టీలని, పేదలు, రైతులు, కార్మికుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న సీపీఐ విధానాలు నచ్చి పార్టీలో చేరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మద్ది కృష్ణ, నాయకులు మోపాడ మధు, షేక్ స్వామి, నిమ్మకాయల అప్పలరాజు, వాడపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావం... క్రమశిక్షణ అవశ్యం

విద్యార్థులకు ఎమ్మెల్యే కూనంనేని ఉద్బోధ

విశాలాంధ్ర-పొన్నూరు: మారుతున్న కాలానికనుగుణంగా విద్యార్థులు చైతన్యవంతంగా, అంకితభావంతో, క్రమశిక్షణతో మెలగాలని, తద్వారా తమ లక్ష్యాలు సాధించుకోవడం సులువవుతోందని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఉద్ఘాటించారు. గుంటూరు జిల్లా పొన్నూరులోని పీబీఎన్ కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ఏర్పాటు చేసిన 'ప్రస్తుత సమాజంలో విద్యా-క్రమశిక్షణ-ప్రాధాన్యత' అనే అంశంపై మంగళవారం జరిగిన సదస్సులో కూనంనేని పాల్గొన్నారు. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు పాములపాటి అమరేంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన సదస్సులో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఇష్టంగా చదవటం ద్వారా తల్లిదండ్రుల కలలు సార్థకం చేయవచ్చునని విద్యార్థులకు బోధించారు. తల్లిదండ్రులను, జన్మభూమిని మరవరాదన్నారు. చదువుతోపాటు క్రమశిక్షణ, సంస్కారం, దేశం పట్ల ప్రేమ అలవర్చుకోవాలని, సామాజిక స్పృహ, సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు విద్యార్థులకు అవసరమని కూనంనేని సూచించారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్, చే గువేరా, వివేకానంద, అబ్దుల్ కలాం, రాజ్‌గురు, భగత్ సింగ్ వంటి మహోన్నతులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. చదువుకు ప్రాధాన్యత ఇచ్చిన ఏ దేశమైనా అభివృద్ధిలో ముందుంటుందన్నారు. భారతదేశంలో చదువుపై రాజకీయాలు చేయడం ద్వారా అభివృద్ధి వైపు వెళ్లలేకపోతున్నామని, చదువుకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే ఆ దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం పూర్వవిద్యార్థుల సంఘం అధ్వర్యంలో కూనంనేనిని ఘనంగా సత్కరించారు. ఎంఎం ఖుద్దూస్, పాములపాటి రవీంద్రనాథ్, ఎన్.మేఘ నాథ్, మహమ్మద్ జిలాని, షేక్ యాసిన్ బాబా, బీవీ చౌదరి, వెలగ వెంకటేశ్వర్లు, ఐటీసీ వెంకట్రావు, సుకుమార్ బాబు, పీబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ నన్నపనేని శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ సత్కారం

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును సీపీఐ గుంటూరు జిల్లా నాయకత్వం ఘనంగా సత్కరించింది. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్, గుంటూరు నగర కార్యదర్శి కోటా మాల్యాద్రి, పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రావుల అంజిబాబు, సీపీఐ పెదకాకాని శాఖ కార్యదర్శి పి.డేవిడ్ రాజు, నాయకులు ఎస్.చిన్న, ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, నాయకులు ఆరేటి సురేశ్, దేవరకొండ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మోదీ మాటల గారడీ... సూర్యుడిని తాకింది

కాంగ్రెస్ అధ్యక్షుడు ఖడ్గే



న్యూఢిల్లీ: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ అనంతరం ప్రధాని మోదీ ప్రకటించిన 'ప్రధాన మంత్రి సూర్యోదయ్ యోజన' పథకంపై కాంగ్రెస్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించింది. ప్రధాని మాటల గారడీ.. సూర్యుడిని తాకిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖడ్గే ఎద్దేవా చేశారు. పదేళ్లలో దేశవ్యాప్తంగా కనీసం 10 లక్షల ఇళ్లపై సౌరఫలకాలు ఏర్పాటు చేయలేని ప్రభుత్వం... కోటి ఇళ్లకు సౌర విద్యుత్తు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు బీజేపీ వేసిన ఎత్తుగడేనని ఆరోపించారు. 'సోలార్ రూఫ్‌టాప్‌ల ద్వారా 2022 నాటికి 40 గిగావాట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి చేస్తామని గతంలో గొప్పలు చెప్పిన కేంద్రం పూర్తిగా విఫలమైంది. కేవలం 2.2 గిగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికే పరిమితమైపోయింది. కొన్ని ఇళ్లపై సౌరఫలకాలు ఏర్పాటు చేసినా స్థాపిత సామర్థ్యంలో కేవలం ఐదో వంతు మాత్రమే విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఈ విషయంలో ఘోర వైఫల్యాన్ని చవిచూసిన మోదీ... తాజాగా సరికొత్త లక్ష్యాన్ని నిర్దేశించారు. 2026 నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అంటున్నారు. ఎలాంటి కొత్త నిధులు మంజూరు చేయకుండా ఇది సాధ్యమయ్యే పనేనా? ఎన్నికలు వస్తున్నాయంటే... మోదీ మాటల గారడీకి సమయం వచ్చినట్లే' అని ఖడ్గే విమర్శించారు. దేశంలోని కోటి గృహాలకు సౌర విద్యుత్ సౌకర్యం కల్పించాలన్న లక్ష్యంతో మోదీ సోమవారం 'ప్రధాన మంత్రి సూర్యోదయ్ యోజన' పథకాన్ని ప్రకటించిన సంగతి తెలిసిందే. సూర్యవంశ భగవాన్ శ్రీరాముడి కాంతి నుంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఎల్లప్పుడూ శక్తిని పొందుతుంటారని, దేశంలోని ప్రజలంతా వారి ఇళ్ల కప్పులపై సొంత సౌర ఫలకాల వ్యవస్థ కలిగిఉండాలనే సంకల్పంతోనే ఈ నిర్ణయం తీసుకున్నానని ఎక్స్ వేదికగా వెల్లడించారు. సౌరశక్తిని వినియోగించుకోవడం వల్ల పేద, మధ్యతరగతి ప్రజల విద్యుత్తు బిల్లులు తగ్గడమే కాకుండా ఇంధన రంగంలో మన దేశం స్వావలంబన దిశగా ముందడుగు వేస్తుందని ఆయన తెలిపారు.

చైనాలో భూ ప్రకంపనలు

బీజింగ్: అర్ధరాత్రి అందరూ గాఢనిద్రలో ఉండగా చైనా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీగా భూమి కంపించడంతో జనం భయాందోళనకు గురయ్యారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 14 సార్లు భూమి కంపించడంతో తీవ్రత అధికమైంది. అత్యధికంగా 7.1 తీవ్రత నమోదైంది. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. చైనా కిర్గిస్థాన్-జిన్జియాంగ్ సరిహద్దు ప్రాంతంలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటలకు అందరూ గాఢనిద్రలో ఉండగా భారీగా భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రత నమోదైంది. చాలా భవనాలు నేలమట్టమయ్యాయి. ఆస్తి, ప్రాణ నష్టం ఎక్కువగానే ఉండవచ్చని తెలుస్తోంది. తెల్లవారుజామున 2 గంటల 9 నిమిషాలకు అత్యధికంగా 7.1 తీవ్రత నమోదు కాగా ఆ తరువాత 4 గంటల వరకూ 14 సార్లు కంపించింది. చైనా భూకంపం ప్రభావం రైళ్ల రాకపోకలపై పడింది. ట్రాక్‌లు దెబ్బతినడంతో చాలా రైళ్లు రద్దయ్యాయి. భూకంపం ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర సేవల విభాగాన్ని ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం చేసింది. సహాయక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. చైనాలో గత 24 గంటల వ్యవధిలో చాలాసార్లు భూమి కంపించింది. అటు పొరుగు దేశం కజికిస్థాన్లోని ఆల్మటీలో 6.7 తీవ్రత నమోదైంది. దాంతో జనం భయంతో బయటకు పరుగులు తీశారు. చైనాలో భూకంపం ధాటికి ఎంతమంది మరణించారనేది ఇంకా తెలియలేదు. అయితే ఆస్తి, ప్రాణ నష్టం భారీగానే ఉండవచ్చని తెలుస్తోంది. ఎందుకంటే భూకంపం ధాటికి చాలా భవనాలు నేలకూలాయి. భూకంప కేంద్రం చైనాలోని జిన్జియాంగ్ ప్రాంతంలో 27 కిలోమీటర్ల లోతు వరకూ వ్యాపించిందని జర్మన్ రీసెర్చ్ సెంటర్ ఫర్ జియోసైన్సెస్ తెలిపింది. భూకంపం ధాటి ఎంత ఉందంటే...1400 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిల్లీలో కూడా ప్రకంపనలు కన్పించాయి.

ఎంపీలో చర్చిలపై కాషాయ జెండాలు

మతచిచ్చుకు ఉన్మాదుల కుట్ర

న్యూఢిల్లీ: బీజేపీ, ఆర్ఎస్ఎస్ మద్దతుతో హిందూ మతోన్మాదులు దేశంలో మతచిచ్చుకు తెరలేపారు. ఓవైపు అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు జరుగు తుండగా... మరోవైపు మతోన్మాదులు మతచిచ్చు రగిలించడానికిగాను వికృతచేష్టలకు పాల్పడ్డారు. క్రైస్తవులు పవిత్రంగా భావించే చర్చిలపై మతోన్మాదులు కాషాయ జెండాలు ఎగురవేశారు. ఇలాంటి నాలుగు ఘటనలు బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లోని జబువా జిల్లాలో 21వ తేదీన చోటుచేసుకున్నాయి. జైజై సియారామ్ అంటూ నలుగురు ఉన్మాదులు ఓ చర్చిపైకి ఎక్కి శిలువకు కాషాయ జెండా కట్టారు. ఆ జెండాపై జై శ్రీరామ్ అని రాయడంతోపాటు హనుమంతుడి బొమ్మ ఉంది. జబువా జిల్లాలోనే ఇలాంటి ఘటనలు నాలుగు జరిగాయి. అదే రోజు ఆస్ట్రేలియా మతబోధకుడు గ్రహం స్టెయిన్స్, ఆయన ఇద్దరు కుమారులను బజరంగ్‌దళ్ ఉన్మాదులు దారుణంగా హత్య చేసి 25 ఏళ్లు పూర్తి చేసుకుంది.రామమందిర ప్రారంభోత్సవం ఉత్సవాల్లో భాగంగా హిందూమత ఉన్మాదులు జబువా జిల్లాలోని నాలుగు గ్రామాల్లో చర్చిలపై కాషాయ జెండాలు కట్టారని స్థానికులు తెలిపారు. దబ్తాలాయ్, మటసుల, ఉబెరావ్, ధమనినాతు గ్రామాల్లో ఈ ఘటనలు జరిగాయి. గిరిజనుల ఆధిపత్యం గల గ్రామాల్లో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలతో క్రైస్తవ గిరిజనుల్లో భయోత్పాత వాతావరణం ఏర్పడింది. దీనికి సంబంధించి ఒకే ఒక పాస్టర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మమత నాకు ఆత్మీయురాలు

అధిర్ రంజన్ వ్యాఖ్యలపై రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: పశ్చిమ్ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తనకు అత్యంత ఆత్మీయురాలని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. తృణమూల్ అధినేత్రిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరి చేసిన విమర్శలపై మంగళవారం ఆయన స్పందించారు. 'మమత బెనర్జీ నాకు అత్యంత ఆత్మీయురాలు. కొన్నిసార్లు మా నేతలు ఏదో మాట్లాడుతుంటారు. అవన్నీ పెద్దగా పట్టించుకోవాల్సిన పని లేదు' అని మీడియాతో చెప్పారు. కొన్ని నెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిమిత్తం బెంగాల్‌లోని లోక్‌సభ సీట్ల పంపకంపై చర్చలు జరుగుతున్నాయన్నారు. కొన్నిసార్లు తమ నేతలు కొన్ని వ్యాఖ్యలు చేస్తుంటారని, అలాంటి వ్యాఖ్యలు చర్చలపై ప్రభావం చూపవని పేర్కొన్నారు. దీదీ సహకారం లేకుండానే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ సొంతంగా పోటీ చేస్తుందని అధిర్ రంజన్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు ప్రస్తావించగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్ జోడో యాత్ర బెంగాల్, బీహార్ మీదుగా సాగినప్పుడు తాను మమతా బెనర్జీ, నితీశ్ కుమార్‌ను యాత్రలో పాల్గొనాలని తాను ఆహ్వానించానని రాహుల్ గుర్తు చేశారు. 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో భాగంగా ప్రస్తుతం రాహుల్ అసోంలో ఉన్నారు. కాగా, మమతా బెనర్జీ అవకాశవాదని కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి విరుచుకుపడ్డారు. దీదీ సహకారం లేకుండానే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పోటీ చేయాలని ఆయన అగ్ర నాయకత్వాన్ని కోరారు. తాము మమతా బెనర్జీ సాయం లేకుండానే ఎన్నికల బరిలో దిగుతామని, తాము తమ సొంత బలంతోనే ఎన్నికల బరిలో ఉంటామని అధిర్ రంజన్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ సాయంతోనే బెంగాల్‌లో టీఎంసీ అధికారంలోకి వచ్చిందనే విషయం దీదీ గుర్తుంచుకోవాలని అన్నారు. అధిర్ వ్యాఖ్యలతో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీల్లో గందరగోళం నెలకొంది. అధిర్ గతంలోనూ అనేక సార్లు మమతా బెనర్జీపై విమర్శలతో విరుచుకుపడ్డారు.

'సబ్‌కా సాత్.. సబ్‌కా వికాస్' మంత్రానికి రాముడే స్ఫూర్తి: మోదీ

న్యూఢిల్లీ:: కేంద్ర ప్రభుత్వం పఠిస్తున్న 'సబ్‌కా సాత్... సబ్‌కా వికాస్' మంత్రానికి రాముడే స్ఫూర్తి అని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దీని ఫలితం ప్రస్తుతం అన్ని చోట్లా కనిపిస్తోందని చెప్పారు. దశాబ్ద కాలంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి విముక్తి పొందేందుకు ఈ మంత్రమే సహకరించిందన్నారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కు ఆయన లేఖ రాశారు. 'మీరు రాసిన లేఖ అందే సమయానికి నా మనసు భావోద్వేగంతో నిండిపోయి ఉంది. దాని నుంచి బయట పడేందుకు అది ఎంతగానో సహాయపడింది. అయోధ్య ధామ్‌లో గడిపిన క్షణాలను ఎప్పటికీ మర్చిపోలేను. అయోధ్యను నా గుండెల్లో పెట్టుకొని దిల్లీకి తిరిగి వచ్చాను' అని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని 11 రోజులపాటు ఎంతో నిష్ఠగా కార్యక్రమాలను నిర్వహించిన మోదీని అభినందిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల క్రితం లేఖ రాసిన సంగతి తెలిసిందే. సాహసం, కరుణ, కర్తవ్య నిష్ఠకు రాముడు ప్రతీక అని, జాతి నిర్మాతలకు రామాయణం ప్రేరణగా నిలిచిందని ముర్ము తన లేఖలో ప్రస్తావించారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.